


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 02-10-2025 | సంపుటి - 25 | సంచిక -139 | రూ : 4 | పేజీలు: 8


## కరూర్ నగర్ తొక్కిసలాట ఘటన నటుడు విజయ్ కీలక నిర్ణయం

- రాష్ట్ర పర్యటనలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటన
- రాష్ట్రవ్యాప్త పర్యటనను రెండు వారాల పాటు వాయిదా వేస్తున్నట్లు వెల్లడి



2లో

## పాకిస్థాన్‌పై ఆపరేషన్ ఎందుకు ఆపారు?

పాక్ పై ఆపరేషన్ ఎందుకు ఆగిపోయిందో అర్థం కావడం లేదన్న ఒవైసీ



2లో








2లో

## యుద్ధాల్లో సాంకేతికత పెరిగింది.. ఇది ఆందోళన కలిగించే అంశం

- రక్షణ రంగంలో పరిశోధన, అభివృద్ధి బలోపేతం కోసం వినూత్న వ్యవస్థను రూపొందిస్తామన్న కేంద్రమంత్రి
- సాంకేతికతను మనం కూడా అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్న కేంద్ర మంత్రి
- రక్షణ బడ్జెట్ ప్రతి సంవత్సరం పెరుగుతోందని వ్యాఖ్య

## వ్యక్తిత్వ వికాసంతోనే దేశ నిర్మాణం.. అదే ఆర్ఎస్ఎస్ మార్గం

- ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ
- వ్యక్తిత్వ వికాసం ద్వారా దేశ నిర్మాణానికి పాటుపడే సంస్థ అని కొనియాడిన ప్రధాని
- 'నేను' నుంచి 'మనం' వైపు నడిపించే స్ఫూర్తిదాయక సంస్థగా అభివర్ణన
- సంఘ్ పై ఎన్నో కుట్రలు జరిగినా ఎదుర్కొని నిలబడిందని వ్యాఖ్య
- వ్యక్తిత్వ నిర్మాణానికి శాఖలు పవిత్ర వేదికలని కితాబు



2లో

## జూబ్లీహిల్స్.. అభ్యర్థిపై నివేదిక ఇవ్వండి

- ముఖ్యమంత్రి సూచన
- ముగ్గురు మంత్రులు, పీసీసీ అధ్యక్షుడితో సమావేశం



2లో

## విజయదశమి పర్వదినం.. శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు

తెలుగు రాష్ట్రాల్లో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా పదో రోజు అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తులు పలు ఆలయాలకు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు.





## 15 నెలల్లో 4,71,574 మందికి ఉద్యోగాలిచ్చాం: చంద్రబాబు

- విజయనగరం జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు
- సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామన్న సీఎం
- రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నామని వెల్లడి

హైదరాబాద్, 01 అక్టోబర్ : ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తమ ప్రభుత్వం ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని, మానవతా దృక్పథంతో సంక్షేమ పాలన అందిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా దత్తి గ్రామంలో నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి నెలా ఒక గ్రామానికి నేరుగా వచ్చి పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తున్నానని, అందులో భాగంగానే దత్తి గ్రామానికి వచ్చానని చంద్రబాబు తెలిపారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రంలో కేవలం రూ.500 మాత్రమే పింఛను ఇస్తున్నారని, కానీ ఏపీలో మాత్రం తాము అత్యధికంగా అందిస్తున్నామని పోల్చి చెప్పారు. రాష్ట్రంలో ప్రతి వంద మందిలో 13 మందికి పింఛను అందుతోందని, అందులో 59 శాతం మహిళలేనని వివరించారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన "సూపర్ సిక్స్" పథకాలను సూపర్ హిట్

తరువాయి 2లో



# యుద్ధాల్లో సాంకేతికత పెరిగింది.. ఇది ఆందోళన కలిగించే అంశం

ఢిల్లీ, అక్టోబర్ 01 : ప్రస్తుత యుద్ధాల్లో ఆధునిక సాంకేతికత వినియోగం ఆందోళనకరంగా పెరుగుతోందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. డిఫెన్స్ అకౌంట్స్ డిపార్టుమెంట్ 278వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన ప్రసంగిస్తూ, భారత రక్షణ రంగంలో పరిశోధన, అభివృద్ధిని బలోపేతం చేయడానికి ఒక వినూత్నమైన పర్యావరణ వ్యవస్థను రూపొందించనున్నట్లు వెల్లడించారు. యుద్ధాల్లో ఆధునిక సాంకేతికత వినియోగం పెరగడంపై రాజ్‌నాథ్ సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. అత్యాధునిక సాంకేతికతలు సంవత్సరాల తరబడి పరిశోధన మరియు అభివృద్ధి ఫలితంగా రూపొందించబడినవని ఆయన పేర్కొన్నారు. మనం కూడా ఈ సాంకేతికతను అందిపుచ్చుకోవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. మన చుట్టూ ఉన్న పరిస్థితులు మారుతున్నాయని, దేశ భద్రతా అవసరాలు కూడా పెరుగుతున్నాయని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈ కారణంగానే రక్షణ బడ్జెట్ ప్రతి సంవత్సరం పెరుగుతోందని ఆయన అన్నారు. బడ్జెట్ పెరుగుతున్నందున, దానిని సద్వినియోగం చేసుకోవలసిన బాధ్యత కూడా రెట్టింపు అవుతుందని ఆయన స్పష్టం చేశారు. సాంకేతిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన నొక్కి చెప్పారు. దేశీయ సాంకేతిక వ్యవస్థను అభివృద్ధి చేయడానికి నిధులను పెంచుతున్నట్లు ఆయన తెలిపారు.

## కరూర్ నగర్ తొక్కిసలాట ఘటన...
# నటుడు విజయ్ కీలక నిర్ణయం

తమిళనాడు, అక్టోబర్ 01 : తమిళనాడులోని కరూర్ తొక్కిసలాట ఘటన నేపథ్యంలో సినీ నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయన చేపట్టిన రాష్ట్రవ్యాప్త పర్యటనలను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్త పర్యటనలను రెండు వారాల పాటు వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఇటీవల విజయ్ కరూర్ ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో టీవీకే 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటనను విడుదల చేసింది. "తొక్కిసలాట ఘటనలో ఆత్మీయులను కోల్పోయిన బాధ, దుఃఖం నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో వచ్చే రెండు వారాల పాటు బహిరంగ సభ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నాం. పర్యటనలకు సంబంధించిన కొత్త షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తామని మా అధినేత ఆమోదంతో తెలియజేస్తున్నాం" అని పార్టీ హెడ్ క్వార్టర్స్ సెక్రటరియేట్ ప్రకటించింది.

# 15 నెలల్లో 4,71,574 మందికి ఉద్యోగాలిచ్చాం

అమరావతి, అక్టోబర్ 01 : ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తమ ప్రభుత్వం ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని, మానవతా దృక్పథంతో సంక్షేమ పాలన అందిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా దత్తి గ్రామంలో నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి నెలా ఒక గ్రామానికి నేరుగా వచ్చి పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తున్నానని, అందులో భాగంగానే దత్తి గ్రామానికి వచ్చానని చంద్రబాబు తెలిపారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రంలో కేవలం రూ.500 మాత్రమే పింఛను ఇస్తున్నారని, కానీ ఏపీలో మాత్రం తాము అత్యధికంగా అందిస్తున్నామని పోల్చి చెప్పారు. రాష్ట్రంలో ప్రతి వంద మందిలో 13 మందికి పింఛను అందుతోందని, అందులో 59 శాతం మహిళలేనని వివరించారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన "సూపర్ సిక్స్" పథకాలను సూపర్ హిట్ చేశామని, అన్ని హామీలను అమలు చేస్తున్నామని ఆయన అన్నారు. మహిళల కష్టాలు తీర్చేందుకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. "స్త్రీ శక్తి" పథకం కింద ఆగస్టు 15న ప్రారంభించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కేవలం 45 రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 10 కోట్ల మంది మహిళలు వినియోగించుకున్నారని తెలిపారు. డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చిందే తెలుగుదేశం ప్రభుత్వమని గుర్తుచేశారు. రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని చంద్రబాబు అన్నారు. ఇప్పటికే రైతు భరోసా కింద ప్రతి రైతుకు రూ.6,000 జమ చేశామని, త్వరలోనే మరో రూ.14,000 అందిస్తామని హామీ ఇచ్చారు. యువతకు ఉద్యోగాలు కల్పించే బాధ్యత తనదని చెబుతూ, ఏడాదిలోనే మెగా డీఎస్సీ నిర్వహించామన్నారు. ఈ 15 నెలల్లో 4,71,574 మందికి ఉద్యోగాలిచ్చామని తెలిపారు. రాష్ట్రానికి ఇప్పటికే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, వీటి ద్వారా 9 లక్షల ఉద్యోగాలు వస్తాయని సీఎం ధీమా వ్యక్తం చేశారు.

## డిసెంబర్‌లో భారత్ పర్యటనకు రానున్న
# రష్యా అధ్యక్షుడు పుతిన్

ఢిల్లీ, అక్టోబర్ 01 : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ డిసెంబర్ నెలలో భారత్ పర్యటనకు రానున్నారు. ప్రతి సంవత్సరం జరిగే శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు డిసెంబర్ 5,6 తేదీల్లో ఆయన భారత్‌కు విచ్చేయనున్నారు. రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్న కారణంగా భారత్‌పై అమెరికా అధిక సుంకాలు విధిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో పుతిన్ రాక ప్రాధాన్యత సంతరించుకుంది. భారత్‌లో పుతిన్ పర్యటన ఉంటుందని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఈ ఆగస్టులో మాస్కో పర్యటన సందర్భంగా ప్రకటించారు. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ కూడా పర్యటన ఉంటుందని గత వారం ధ్రువీకరించినప్పటికీ, తేదీలను వెల్లడించలేదు. డిసెంబర్ 5, 6 తేదీల్లో పర్యటన ఉంటుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, పుతిన్‌లు గత ఏడాది రెండుసార్లు సమావేశమయ్యారు. జులైలో జరిగిన శిఖరాగ్ర సదస్సులో భాగంగా మోదీ రష్యాకు వెళ్లారు. అక్టోబర్‌లో బ్రిక్స్ సదస్సు సందర్భంగా కజాన్‌లో మరోసారి వీరిద్దరు సమావేశమయ్యారు. ఇటీవల చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులోనూ పుతిన్ మోదీ భేటీ అయ్యారు.

# పాకిస్థాన్‌పై ఆపరేషన్ ఎందుకు ఆపారు?

ఢిల్లీ, అక్టోబర్ 01 : పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై భారత్ ప్రారంభించిన సైనిక చర్యలను మధ్యలోనే ఎందుకు నిలిపివేశారని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ కేంద్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. దేశమంతా ఒక్కతాటిపై నిలిచి, గట్టి సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్న సమయంలో ఆపరేషన్‌ను ఆపివేయడం వెనుక కారణమేంటని ఆయన నిలదీశారు. పహల్గాం దాడి జరిగినప్పుడు మీరే ప్రధాని అయితే ఏం చేసేవారని ఓ విలేకరి ప్రశ్నించగా, ఒవైసీ ఆ ప్రశ్నను సున్నితంగా పక్కనపెట్టారు. "సోదరా, అలాంటి కలలు కనే అలవాటు నాకు లేదు. నేను వాస్తవంలో ఉంటాను. మా లక్ష్యం కేవలం పదవులు చేపట్టడం కాదు" అని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఆయన అసలు విషయానికి వస్తూ, పహల్గాం ఘటన తర్వాత పాకిస్థాన్‌కు గట్టి బుద్ధి చెప్పేందుకు భారత్‌కు ఒక మంచి అవకాశం లభించిందని అన్నారు. "అదొక యుద్ధం లాంటి పరిస్థితి. అలాంటి సమయంలో ఆపరేషన్ ఎందుకు ఆగిపోయిందో నాకు నిజంగా అర్థం కావడం లేదు. దేశం మొత్తం గట్టి సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పుడు ఎందుకు వెనక్కి తగ్గారు? ఇప్పుడు పార్లమెంటులో కూర్చుని పీవోకేను స్వాధీనం చేసుకుంటామని మాట్లాడతారు" అంటూ ఆయన కేంద్రంపై విమర్శలు గుప్పించారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న "మినీ స్విట్జర్లాండ్"గా పిలిచే పహల్గాంలోని బైసరన్ లోయలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఒక నేపాల్ జాతీయుడితో సహా 26 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దాడికి ప్రతీకారంగా భారత్ "ఆపరేషన్ సిందూర్" చేపట్టింది. పాకిస్థాన్, పీవోకేలోని 9 ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసింది. సింధు జలాల ఒప్పందాన్ని నిరవధికంగా నిలిపివేయడంతో పాటు పాక్ జాతీయులను వెనక్కి పంపింది. దీనికి ప్రతిగా పాకిస్థాన్ డ్రోన్లతో భారత పౌర ప్రాంతాలపై దాడులకు దిగింది.

# మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కన్నుమూత



సూర్యాపేట: మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి(73)కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. శనివారం సాయంత్రం సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో దామోదర్‌రెడ్డి భౌతికకాయానికి అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నారు. దామోదర్‌రెడ్డి తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఉమ్మడి ఏపీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కేబినెట్‌లో ఆయన ఐటీ శాఖ మంత్రిగా పనిచేశారు.

# వ్యక్తిత్వ వికాసంతోనే దేశ నిర్మాణం.. అదే ఆర్ఎస్ఎస్ మార్గం

ఢిల్లీ, అక్టోబర్ 01 : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అనేది కేవలం ఒక సంస్థ కాదని, వ్యక్తిత్వ వికాసం ద్వారా దేశ నిర్మాణానికి పాటుపడే ఒక మహోన్నత శక్తి అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. 'నేను' అనే అహాన్ని వీడి 'మనం' అనే సామూహిక భావన వైపు నడిపించే స్ఫూర్తిదాయక ప్రయాణమే సంఘ్ అని ఆయన అభివర్ణించారు. ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో బుధవారం జరిగిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ కు ఎన్నో అనుబంధ సంస్థలు ఉన్నప్పటికీ, వాటన్నింటి లక్ష్యం ఒకటేనని, అదే 'జాతికే ప్రథమ స్థానం' అని స్పష్టం చేశారు. ఏ రెండు అనుబంధ సంస్థల మధ్య వైరుధ్యాలు ఉండవని ఆయన పేర్కొన్నారు. సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ దేశ నిర్మాణం అనే బలమైన సంకల్పాన్ని తీసుకున్నారని మోదీ గుర్తుచేశారు. ప్రతి పౌరుడిలో దేశం పట్ల బాధ్యత పెరిగినప్పుడే దేశం బలోపేతం అవుతుందని ఆయన విశ్వసించారని తెలిపారు. అందుకే వ్యక్తి వికాసానికి ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. నేటికీ సంఘ్ శాఖల్లో ఈ వ్యక్తిత్వ నిర్మాణ ప్రక్రియ కనిపిస్తుందని, ఇవి శారీరక, మానసిక, సామాజిక ఎదుగుదలకు దోహదపడే పవిత్ర వేదికలని ప్రధాని అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో డాక్టర్ హెడ్గేవార్ సహా ఎందరో సంఘ్ కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారని మోదీ గుర్తు చేశారు. స్వాతంత్ర్యానంతరం కూడా సంఘ్ పై అనేక దాడులు, కుట్రలు జరిగాయని ఆయన అన్నారు. సంస్థను అణచివేసేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయని, కానీ వాటన్నింటినీ సంఘ్ ఎదుర్కొని నిలబడిందని తెలిపారు. ఎన్ని కుట్రలు పన్నినా స్వయంసేవకులు ఎన్నడూ ద్వేషానికి ప్రాధాన్యత ఇవ్వలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# అరసవిల్లిలో ఆవిష్కృతమైన అద్భుత ఘట్టం

అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. స్వామివారి మూలవిరాట్ ను సూర్య కిరణాలు తాకాయి. ఈ అద్భుత దృశ్యాన్ని కన్నులారా వీక్షించేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు. సూర్యుడు ఉత్తరాయణం నుంచి దక్షిణాయనానికి మారే సమయంలో అరసవిల్లి సూర్యనారాయణ స్వామి వారిపై ఏడాదికి రెండుసార్లు కిరణస్పర్శ జరుగుతుంది. 6 నిమిషాల పాటు స్వామివారి పాదాల నుంచి శిరస్సు వరకు కిరణ స్పర్శ జరగ్గా.. దానిని తిలకించిన భక్తులు.. కొత్త అనుభూతి పొందామని చెప్తున్నారు.



స్వామివారిని కిరణ స్పర్శలో దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కాగా..ప్రతీ సంవత్సరం అక్టోబర్ 1,2 తేదీల్లో, మార్చి 9,10 తేదీల్లో స్వామివారి పాదాలకు కిరణ స్పర్శ జరుగుతుంది. ఈ ఏడాది కిరణ స్పర్శ జరిగే తేదీల్లో దసరా పండుగ కావడం విశేషం.

## ప్రతి ఇంటా వెలుగులు నింపాలి
# ప్రజలకు సీఎం దసరా శుభాకాంక్షలు

తెలుగు ప్రజల కు ఏపీ సీఎం చంద్రబాబు దసరా శుభాకాంక్షలు తెలిపారు. సకల చరాచర జీవ రాశులను సంరక్షించే శక్తి స్వరూపిణి కనకదుర్గమ్మ తల్లి ఆశీస్సులు అందరికీ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఆయన ట్వీట్ చేశారు. శక్తి ఆరాధనకు ప్రాధాన్యతనిచ్చే ఈ నవరాత్రి సందర్భంగా అమ్మవారి దివ్య మంగళ రూపాన్ని తొమ్మిది అవతారాల్లో దర్శించుకున్నామన్నారు. రాక్షస సంహారంతో లోకానికి శాంతి సౌభాగ్యాలు తెచ్చిన ఆ తల్లి చల్లని చూపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై ఇదే విధంగా కొనసాగాలని కోరుకున్నామని చెప్పారు. "సంక్షేమం, అభివృద్ధితో ఈ మహా యజ్ఞాన్ని కొనసాగించే నైతిక బలాన్ని అందివ్వాలి. అనునిత్యం పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లు, పేదల సేవలో పెన్షన్లు, మహిళలకు ఆసరాగా నిలిచే 'దీపం', ఉచిత బస్సు ప్రయాణ పథకం 'స్త్రీ శక్తి', బిడ్డలను విద్యావంతుల్ని చేసే 'తల్లికి వందనం' రైతుకు అండగా నిలిచే 'అన్నదాత సుఖీభవ', పేదల చేయిపట్టి అభివృద్ధి వైపు నడిపే 'పీ4' విధానం, పారిశ్రామిక ప్రగతితో ఈ దసరా పండుగ ఇంటింటా వెలుగులు నింపాలి." అని కోరుకున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్ అభ్యర్థిపై నివేదిక ఇవ్వండి

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచే సత్తా ఉన్నవారిపై అధ్యయనం చేసి ముగ్గురు అభ్యర్థుల పేర్లను సూచిస్తూ నివేదిక ఇవ్వాలని ముగ్గురు మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారని తెలుస్తోంది. బుధవారం ఇద్దరు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, మహేశ్‌కుమార్‌గౌడ్ సీఎం నివాసానికి వెళ్లి కలిశారు. ఈ సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కూడా వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారని పార్టీ వర్గాలు తెలిపాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణాలు, క్షేత్రస్థాయిలో బలాబలాలు, ఇతర అంశాలన్నింటినీ పరిశీలించి ఈ ఎన్నికల్లో అభ్యర్థులను గుర్తించి పీసీసీకి నివేదికలు పంపాలని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీ హామీల అమలుకు తీసుకున్న చర్యలను ఇంటింటా ప్రచారం చేయాలని సూచించినట్లు సమాచారం. ఇన్‌ఛార్జి మంత్రులు, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు వారి వారి జిల్లాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో అత్యధికశాతం నెగ్గేలా ఇప్పటి నుంచే కలసికట్టుగా కష్టపడి పనిచేయాలని రేవంత్‌రెడ్డి చెప్పారని నేతలు వివరించారు.

# నేనే పోరాటం చేస్తా: ఎమ్మెల్యే విరుపాక్షి హెచ్చరిక

కర్నూలు జిల్లా ఆస్పరి మండలం యాటకల్లుకు చెందిన రైతు శేఖర్ ఉల్లి సాగు చేశారు. అయితే పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కలేదు. దీంతో అదే ఉల్లిని ట్రాక్టర్లతో తీసుకెళ్లి వంకలో పారపోశారు. దీంతో రైతు శేఖర్‌ను ఎమ్మెల్యే విరుపాక్షి పరామర్శించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. రైతులు కష్టాలు పడుతున్నా ఈ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా ఉందన్నారు. రైతులు పండించిన ఉల్లి, పత్తి, మిరప పంటకు కూడా గిట్టుబాటు ధర లేదన్నారు. ఉల్లికి రూ. 1200 గిట్టుబాటు ధర చెప్పినా ఏ రైతు దగ్గరా ఉల్లిని ప్రభుత్వం తీసుకోలేదన్నారు. ఉల్లికి ఒక హెక్టార్‌కు రూ. 50 వేలు ప్రకటించినా ఏమాత్రం సరిపోదని తెలిపారు. రైతు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించకపోతే తాను రైతుల తరఫున పోరాడుతూనే ఉంటానని ఎమ్మెల్యే విరుపాక్షి హెచ్చరించారు.



# ఆటో డ్రైవర్ల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలి

*** సిఐటియూ జిల్లా కమిటీ సభ్యుడు భూక్య రమేష్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రతి ఆటో డ్రైవర్ కి 12000 జీవనభృతి కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు భూక్య రమేష్ డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆటో, ట్రాలీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ సిఐటియు మహాసభ నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా భూక్యా రమేష్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు నిత్యం డ్రైవింగ్ చేస్తూ అదే జీవనాధారంగా కొనసాగుతున్న కుటుంబాలు సుమారు నాలుగు వేల ఆటో లు ఉన్నాయన్నారు, ప్రభుత్వం ప్రకటించిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఆటో డ్రైవర్ల జీవితాలు రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికే సరైన కిరాయిలు దొరకక ఆటోలు అమ్ముకుంటూ రోజు కూలికి పోయే పరిస్థితి వచ్చింది అన్నారు. ఒకవైపు ఆటో కిరాయిలు లేక అప్పుల పాలై ఇబ్బందులు పడుతుంటే మరోవైపు ఈ ఏం ఐ లు కట్టాలని .. ఆటో కిస్తీలు కట్టకపోతే ఫైనాన్స్ వ్యాపారస్తులు ఆటోలు గుంజుకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి వేధింపులు అరికట్టాలని అన్నారు. దీనంతటికీ కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన విమర్శించారు. మోటార్ ఫీల్డ్ కి అలవాటు పడ్డ నిరుద్యోగులు అందరికీ ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డ్రైవింగ్ చేసే వారందరికీ సరైన ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు . రోడ్డుపై ప్రజలు ఆటో ఎక్కుతున్న సందర్భంలో. పోలీసులు ఫోటోలు తీసి అదనపు ఫైన్ లు చార్జీలు వేస్తున్నారని దాంతో ఆటో డ్రైవర్లకు అందరికీ నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ఫోటోలు కొట్టే పద్ధతి రద్దు చేయాలని అన్నారు. పోలీసు డిపార్ట్మెంట్ వారికి పై అధికారులకు చెప్పి ఆటో డ్రైవర్ల పట్ల సానుభూతి చూపేలా పోలీసు డిపార్ట్మెంట్ వారినీ కోరారు . స్థానిక ఆటో అడ్డాలలో వస్తున్న ఆటో డ్రైవర్ల సమస్యలపై ట్రాఫిక్ పోలీసు వారు విధిస్తున్న ఆంక్షలు అని సడలించాలని వారు కోరారు . కొత్తగూడెం పట్టణంలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఆటో యూనియన్ ఆధ్వర్యంలో దశల వారి కార్యక్రమాల నిర్వహిస్తామని తెలిపారు. ఈ సభలో సిఐటియు జిల్లా నాయకులు లిక్కి బాలరాజు రామకోటి సయ్యద్ నరసింహారావు శివ తదితరులు పాల్గొన్నారు.




*** నూతన కమిటీ ఎన్నిక**

కొత్తగూడెం పట్టణ ఆటో, ట్రాలీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ సిఐటియు నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది .అధ్యక్షులుగా నునావత్ రామకోటి , కార్యదర్శిగా సయ్యద్ నీ ఎన్నుకోవడం జరిగింది.కమిటీ సభ్యులుగా రాంబాబు శివ గణేష్ నరసింహ పాషా ముజాహిద్ ప్రేమ్ కుమార్ రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## మహిళలకు దసరా పండుగ చీరలు అందజేత



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కాప్రా డివిజన్ పరిధిలో దసరా పండుగ శుభాకాంక్షలతో మహిళా సోదరీమణులకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకుడు రేగళ్ల సతీష్ రెడ్డి చీరలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సేవలో ఎల్లప్పుడూ కృషి చేస్తూ, బి ఆర్ ఎస్ పార్టీకి అహర్నిశలు శ్రమిస్తున్న మహిళలకు దసరా కానుకగా చీరలను అందజేయడం ఆనందంగా ఉంది అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ కాప్రా డివిజన్ సీనియర్ నాయకురాలు సరోజ, రిటైర్డ్ ప్రొఫెసర్ సవిత రావు, సుజాత గౌడ్, సరిత నాయక్, గీత, సరిత, దివ్యలత, సీనియర్ నాయకుడు నంగునూరి మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకం

*** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ ఇందిరా నగర్ (నాగార్జున నగర్ )లో బుధవారం జరిగిన కాలనీ సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరానగర్ కుటుంబాల భాగస్వామ్యంతో నిర్మాణం పూర్తి చేసుకున్న కమ్యూనిటీ హాలు ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కాలనీ అభివృద్ధి కోసం అవసరమైన నిధులను మంజూరు అయ్యేలా చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఇందిరానగర్ చైతన్య వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి వర్గం సభ్యులు బివి నరసింహారెడ్డి, శివారెడ్డి, కృష్ణారెడ్డి, భాస్కరాచారి, శ్రీనివాస్ రెడ్డి, రాంప్రసాద్, వెంకట్రావు, సారా అనిల్ ముదిరాజ్ తదితజరులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి శాలువా కప్పి సత్కరించారు.ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసి ఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి,నాయకులు నేమురి మహేష్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, గంప కృష్ణ, సారా వినోద్ ముదిరాజ్, ఎస్ ఏ రహీం, మొగిలి రాఘవరెడ్డి గడ్డల పాండు మన్నే నరేష్ యావపురం రవి దాసరి కనకయ్య శ్రీశైలం రాధాకృష్ణమూర్తి, నాగేశ్వరరావు బిక్షపతి గౌడ్ కృష్ణంరాజు జి. శ్రీనివాస్, జి మురళి, రమణ నాయక్ సీఎం రెడ్డి ఏ వెంకటేష్ నాగూర్ ఎస్ ఎం భాష, వెంకటేశ్వరరావు బి ప్రసాద్ రావు బాపూజీ తదితరులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



జగద్గిరిగుట్ట , (ప్రజాస్ఫూర్తి) : దేవి శరన్నవరాత్రుల 10 వ రోజు సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మగ్దూం నగర్ లో ముఖేష్ సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారి పూజ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలుకుల జగన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు కొలుకుల జైహింద్, నాని శ్రీనివాస్, రాజు. ముఖేసింగ్ రూపేష్. నరేష్. తదితరులు పాల్గొన్నారు.



# వ్యక్తి పరివర్తన పరిశ్రమే ఆర్ఎస్ఎస్

*** జిన్నారంలో ఘనంగా ఆర్ఎస్ఎస్ శతజయంతి వేడుకలు**

*** ఉత్సాహంగా పాల్గొన్న సంఘ్ సభ్యులు**

జిన్నారం,ప్రజాస్ఫూర్తి 01: వ్యక్తి పరివర్తనే చెందితేనే సమాజం పరివర్తన చెందుతుందని, వ్యక్తి పరివర్తన పరిశ్రమే ఆర్ ఎస్ ఎస్ అని ఆర్ ఎస్ ఎస్ సంగారెడ్డి జిల్లా ప్రముఖ వ్యక్త నర్సింలు అన్నారు. జిన్నారం లో హిందూ జాగరణ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఆర్ఎస్ఎస్ శతజయంతి వేడుకలలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆర్ ఎస్ ఎస్ సంస్థ స్థాపించి నేటికి వంద సంవత్సరాలు పూర్తవుతున్నాయని తెలిపారు. సంస్థ స్థాపించిన నాటి నుండి నేటి వరకు సమాజ పరివర్తనకు, అదేవిధంగా దేశ సేవలో ముందుంటుందని తెలిపారు. భారత మాత ముద్దు బిడ్డలైన మనం భారత జాతి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వ్యక్తి పరివర్తన నుండి కుటుంబ పరివర్తనం, కుటుంబ పరివర్తనం నుండి సమాజ పరివర్తన, సమాజ పరివర్తన నుండి భారత జాతి పరివర్తనం చెందుతుందని తెలిపారు.అనంతరం ముఖ్య అతిథులు మండల హిందూ జాగరణ సమితి అధ్యక్షులు ఆనంద్ చారి, వివేకానంద పాఠశాల ప్రిన్సిపాల్ కరుణసాగర్ రెడ్డి లు మాట్లాడుతూ హిందూ సమాజాన్ని ఏకతాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. కార్యక్రమంలో హిందూ జాగరణ సమితి ప్రధాన కార్యదర్శి టెంట్ శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షులు బ్రహ్మేందర్ లు సభ్యులు పాల్గొన్నారు.



# శాస్త్రి 'కి నివాళి ఇదేనా..!

*** శిథిలమైన లాల్‌బహద్దూర్ శాస్త్రి విగ్రహం**

*** పట్టించుకోని అధికారులు, నాయకులు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రధాన మంత్రిగా భారత దేశానికి విశేష సేవలందించిన వారిలో లాల్ బహద్దూర్ శాస్త్రి ఒకరు. 1964 నుంచి 1966 వరకు రెండేళ్లు ప్రధానిగా పనిచేసిన ఆయన 'జై జవాన్ - జై కిసాన్' అనే నినాదాన్ని ఇచ్చారు. అటువంటి గొప్ప నాయకుడికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అవమానం జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణానికి అతి సమీపంలోగల రామవరం నందు లాల్ బహద్దూర్ శాస్త్రి విగ్రహం ఉండేది. ప్రతి ఏడాది అక్టోబర్ 2వ తేదీన శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించేవారు. అయితే ది.25.09.2024న తెల్లవారుజామున 108 వాహనం శాస్త్రి విగ్రహాన్ని ఢీకొట్టడంతో విగ్రహం నేలకూలింది. పాక్షికంగా ధ్వంసమైన ఆ విగ్రహాన్ని పక్కనే పడేయడంతో అదికాస్తా నేడు శిథిలావస్థకు చేరుకుంది. ప్రభుత్వ అధికారులుగాని, నాయకులు గాని శాస్త్రి విగ్రహాన్ని పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక మాజీ ప్రధానికి ఇచ్చే గౌరవం ఇదేనా అని చర్చించుకుంటున్నారు. కనీసం ప్రభుత్వ అధికారులైనా ఆయన విగ్రహాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉండగా, వారు కూడా ఏమీ పట్టనట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఆయన విగ్రహాన్ని పునరుద్ధరించకపోవడంతో రెండేళ్లుగా జయంతి వేడుకలు జరుపుకునే పరిస్థితి లేదు. కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించి ధ్వంసమైన మాజీ ప్రధాని లాల్ బహద్దూర్ శాస్త్రి విగ్రహాన్ని పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





## దేవి నవరాత్రి ఉత్సవాల్లో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి

ప్రజాస్ఫూర్తి, కాప్రా : దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి వివిధ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జైజవాన్ కాలనీ దుర్గ మాత ఆలయం, భవానీ నగర్ అసోసియేషన్, నాచారం హనుమాన్ నగర్, సావర్కర్ నగర్, నాచారం ఓల్డ్ విలేజ్, ఉప్పల్ న్యూ శాంతినగర్ లఖన్ వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిష్ఠల వద్ద ప్రత్యేక పూజలు చేసి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కాశీటి ప్రసాద్, కొత్త అంజిరెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, వాసునూరి ప్రకాష్ రెడ్డి, భూపాల్ రెడ్డి, అజీజ్, నర్సిమ, సంతోష్ రెడ్డి, నెమలికొండ మహేష్ యాదవ్, సునీల్ రెడ్డి, మెతుకు శ్రీనివాస్ రెడ్డి, లింగం, అల్లూరయ్య, అనప్ రెడ్డి వెంకట్ రెడ్డి, ఎస్ఎం సాయియాబ్, సలీం, ప్పేరా, అల్లపక్షి, దుబాయ్ రావు, వల్లి, దస్తగిరి, ఖాదర్ వల్లి, అలాగే ఆలయ కమిటీ సభ్యులు రంగస్వామి, యాదగిరి రెడ్డి, యురేదర్ రెడ్డి, త్రినాథ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యలక్ష్మి ఇండస్ట్రీస్ పరిశ్రమలో ఘనంగా విజయదశమి వేడుకలు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి లోని పంచశీల కాలనీలో గల రాజ్యలక్ష్మి ఇండస్ట్రీస్ పరిశ్రమలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమ యజమాన్యం , లయన్స్ క్లబ్ ఆఫ్ గాంధీనగర్ (ఆర్య)వ్యవస్థాపకులు లయన్ డాక్టర్.చిల్లా రాజశేఖర్ రెడ్డి, లయన్ మనోహర్ లు కుటుంబ సభ్యులతో కలిసి దుర్గామాత,ఆయుధ పూజలు చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ దసరా పండగ విజయానికి ప్రతీకగా నిలుస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్,పలు పరిశ్రమ ప్రతినిధులు హేమాద్రి నాయుడు,వెంకటరమణ,రవీంద్ర ప్రసాద్,మధుసూదన్ జుంజువాల, పరిశ్రమ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## అనాధాశ్రమంలో చిన్నారి పుట్టినరోజు వేడుకలు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సి. త్యాగరాజన్ మనుమరాలు ధృతి పుట్టినరోజు సందర్భంగా బుధవారం కొత్తగూడెం పట్టణం చమన్‌బస్తీలోని జ్యోతి అనాధ, వృద్ధాశ్రమంలో చిన్నారి కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. ప్రకృతి హరితదీక్షపరురాలు నైనిక రజువా, అఫాన్ జైదీలు పాల్గొని చిన్నారి ధృతికి మొక్కను ఇచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధృతి కుటుంబ సభ్యులు, ఐఎన్‌టీయూసీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సీతారామరాజు, నాయకులు రజాక్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత ఆశిస్సులు అందరిపై ఉండాలి

## దుర్గామాత ఆశిస్సులు అందరిపై ఉండాలి

*** చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా యువతేజ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నర్సింగ్ గౌడ్ సారథ్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ బుధవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక భక్తులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు నిర్వాహకులను బొంతు శ్రీదేవి అభినందించారు. ఆమె మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఇలా భక్తి పూర్వకంగా నిర్వహించే నవరాత్రి ఉత్సవాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయి అని పేర్కొన్నారు. ఉత్సవ వాతావరణంలో యువత, స్థానికులు ఆనందంగా భాగస్వాములై దుర్గామాత ఆశీస్సులు పొందారు.

# ఘనంగా అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం

*** పలువురు వయో వృద్ధులను సత్కరించిన 'సీనియర్ సిటీజన్స్'**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా కొత్తగూడెంలోని తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు వయో వృద్ధులను ఘనంగా సన్మానించారు. విద్యానగర్ కాలనీ నందుగల అసోసియేషన్ భవనంలో కార్యదర్శి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమం సభ్యులు సీతారామ శాస్త్రి మనవరాలు చేంబూలి శ్రీనిత్య, సభ్యులు గురుమూర్తి ల గీతాలాపనతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా 80 సంవత్సరాలు పైబడిన సభ్యులు ఎ.బి. కృష్ణమూర్తి, దమ్మాలపాటి శేషయ్య, వేములపల్లి శ్రీనివాసరావు, టి.పాండురంగారావులను ఘనంగా సత్కరించారు. హైదరాబాద్ ఈఎస్ఐ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ సర్జన్ గా పనిచేస్తున్న డాక్టర్ అబ్బూరి సత్యనారాయణ, ఎక్సోడస్ ఓవర్సీస్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ కె.నరేంద్ర బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని కేక్ కట్ చేశారు. అసోసియేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులైన డాక్టర్ సత్యనారాయణ రూ.10వేల ఆర్థిక సహకారం ప్రకటించారు. రానున్న విద్యా సంవత్సరంలో ఒక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కావలసిన అన్ని విద్యా సామాగ్రిని ఉచితంగా అందిస్తామని



హామీ ఇచ్చారు. కొత్తగూడెం సీపీఐ మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి సీనియర్ సిటిజన్స్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ సన్మాన గ్రహీతలు ఒక్కొక్కరు ఒక్కో రంగం లో నిష్ణాతులని, నేటికీ వారి సేవలను సమాజానికి అందిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు జీఎంవీ. ప్రసాదరావు, పి. రామానుజ స్వామి, కేశవరావు, సామ్యూల్, విజయమోహన్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## నేర నియంత్రణకు మీడియా, ప్రజల సహకారం అవసరం

*** కుషాయిగూడ ఏసీపీ వెంకట్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : సమాజంలో నేర నియంత్రణకు ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జీవించేందుకు మీడియా మద్దతుతో పాటు ప్రజల సహకారం అత్యంత అవసరమని కుషాయిగూడ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ యాస వెంకట్ రెడ్డి తెలిపారు. విజయదశమి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజల్లో ఏసీపీ వెంకట్ రెడ్డి పాల్గొని పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో హింసను రూపుమాపడానికి, నేర నియంత్రణలో మీడియా, ప్రజలతో పాటు కాలనీ సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో ముఖ్యమైంది అని పేర్కొన్నారు. దసరా పండుగ సందర్భంలో ఊర్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లలో విలువైన వస్తువులను వదిలివేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్హెచ్ఓ భాస్కర్ రెడ్డి, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ (క్రైమ్) వెంకటేశ్వర్లు, లయన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ లయన్ వడ్లోజు జ్యోతిర్మయాచారి, సబ్ ఇన్స్పెక్టర్లు వెంకన్న, శ్రీనివాస్, సాయిలు, సతీష్, విజయ్, పాత్రికేయులు శ్రీనివాస్, బాల్ రెడ్డి, గుంటూరు శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు, మున్సిపల్ సిబ్బందికి బట్టలు చీరలు పంపిణి



మేడిపల్లి, (ప్రజాస్ఫూర్తి): దసరా బతుకమ్మ పండగ చీరలు నిరుపేద మహిళలకు ఇచ్చిన ఘనత గత బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ సీనియర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కొత్త లక్ష్మి రవి గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిల స్ఫూర్తితో దసరా సందర్భంగా నిరుపేద మహిళలకు, బోడుప్పల్ కార్పొరేషన్ 1, 2, 3వ డివిజన్ల మున్సిపల్ సిబ్బందికి, సుమారు ఐదువందల మంది నిరుపేద మహిళలకు బట్టలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా కొత్త రవి గౌడ్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నిరుపేద ప్రజలకోసం ఎంతో చేశారని అన్నారు. మాకు తోచినట్లు మాజీ మంత్రి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సహాయ సహకారంతో మా మున్సిపల్ సిబ్బందికి, డివిజన్లోని నిరుపేద మహిళలకు సుమారు 500మందికి బట్టలు, చీరలు పంపణి చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**పాక్ సైన్యం భారీ ఆపరేషన్..**

## సొంత ప్రజల పైనే డ్రోన్లతో దాడి

పాకిస్థాన్ భారీస్థాయిలో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లు నిర్వహిస్తోంది. బలోచిస్థాన్ సొంత ప్రజల పైనే దాడులు చేస్తోంది. పాక్ సేనలు వాడుతోన్న శతఘ్నులు, మోర్టార్లతో కుజ్దార్ జిల్లాలోని జెహ్రీ ప్రాంత ప్రజలు వణికిపోతున్నారు. నాలుగు రోజులుగా డ్రోన్లతో జరుగుతోన్న ఈ ఆపరేషన్‌తో ప్రజలు లాక్‌డౌన్‌లోకి వెళ్లిపోయారు. వారికి ఆహారం, ఇంధనం కొరత ఏర్పడిందని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. వరుస బాంబు దాడులతో పత్తి పొలాలన్నీ ధ్వంసమయ్యాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నాయి. ఛశ్మా ప్రాంతంలో శతఘ్నులు, మోర్టార్ల కారణంగా మరణాలు సంభవించినట్లు సమాచారం. ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంతో పూర్తిస్థాయి సమాచారం అందుబాటులో లేదు. బలోచ్ లిబరేషన్ ఆర్మీ, బలోచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ లక్ష్యంగా ఈ దాడులు జరుగుతున్నాయి. వాటి అధీనంలో ఉన్న జెహ్రీని తిరిగి స్వాధీనం చేసుకొనే లక్ష్యంతో పాక్ సేనలు ఈ దాడులు చేస్తున్నాయి. ఇటీవల కూడా పాక్ సొంత ప్రజలపై దాడులు చేసిన సంగతి తెలిసిందే. గతనెల ఖైబర్ పఖ్తున్‌ఖ్వాలోని మాత్రె దారా గ్రామంపై ఫైటర్ జెట్‌లు ఎల్‌ఎస్6 రకం 8 బాంబులను జారవిడిచాయి.



## సీనియర్ సిటిజన్స్ నేటి తరానికి మార్గదర్శకులు

## బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : సీనియర్ సిటిజన్స్ నేటి తరానికి మార్గదర్శకులుగా ఉండాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. బుధవారం జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులను శాలువా, మెమోంటోలతో సత్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటితరం ఇంట్లోని వయోవృద్ధులను భారంగా కాకుండా వారితో ప్రేమగా ఉన్నట్లయితే జీవితంలోని ఆటుపోట్లను ఎలా ఎదుర్కోవాలో వారి నుండి తెలుసుకొని బంగారు భవిష్యత్తును రూపొందించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎస్. నరసింహారెడ్డి, సలహాదారులు జి. బలవంత రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్ది మల్లేశం, కోశాధికారి ఆర్. మురళి గౌడ్, ముఖ్య ఉపాధ్యక్షులు లింగం గౌడ్, ఉపాధ్యక్షులు నరహరి గౌడ్, ఎన్. నాగేష్ కుర్మ, సంయుక్త కార్యదర్శి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మణాచారి, కమిటీ సభ్యులు బిక్షపతి గౌడ్, స్థానిక బిఆర్ఎస్ నాయకులు కుంట వేణు, ఆటో బలరాం, మహిళా నాయకురాలు అరుణా రెడ్డి, నాయకులు నార్లకంటి శ్యామ్, నల్ల ప్రసాద్, నల్ల వేణు, భూపాల్ రెడ్డి, రాజు (చిన్న) తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదలతో మెడికల్ ప్రవేశ పరీక్షలో అద్భుత ప్రతిభ కనబరిచిన అక్షర

*** ఆత్మకూర్ గ్రామానికి గర్వకారణం**



హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : పట్టుదలతో కృషి చేస్తూ, మెడికల్ ప్రవేశ పరీక్షలో అద్భుత ప్రతిభ కనబరిచిన ఆత్మకూర్ గ్రామానికి చెందిన యాతాకుల అక్షర రెండో దశ కౌన్సెలింగ్‌లో మల్లారెడ్డి మెడికల్ కాలేజీ (సీఎంఆర్ఎం)లో ఎంబిబిఎస్ సీటు సంపాదించింది. హైదరాబాద్ రాంనగర్ నివాసి, ఆత్మకూర్ గ్రామానికి చెందిన యాతాకుల కుటుంబపు ముద్దుబిడ్డ అక్షర మరో గొప్ప విజయాన్ని నమోదు చేసింది. యాతాకుల మంగమ్మ చిన్నకొడుకు అశోక్-ఉపేంద్రల కుమార్తె అక్షర, విద్యాభ్యాసంలో చిన్నప్పటి నుంచే ప్రతిభను ప్రదర్శించింది. కష్టపడి చదువుతూ నీట్ పరీక్షలో 360 మార్కులు, 2,92,382 ర్యాంక్ సాధించి వైద్యవిద్యలో అడుగుపెట్టే అవకాశం సొంతం చేసుకుంది.అక్షర విజయంతో ఆత్మకూర్ గ్రామానికి మరో మెడికల్ సీటు రావడం గ్రామ ప్రజలకు గర్వకారణంగా మారింది. గ్రామ పెద్దలు, బంధువులు, స్నేహితులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, "అక్షర కృషి, పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహమే ఈ విజయానికి మూలం" అని అభిప్రాయపడ్డారు.డాక్టరై సమాజానికి సేవ చేయాలన్న సంకల్పం అక్షరది, ఈ సందర్భంగా అక్షర మాట్లాడుతూ తాను సాధించిన ఈ మెడికల్ సీటు వ్యక్తిగత విజయమే కాదు, నా కుటుంబం, నా గ్రామం, నా సమాజం కోసం సాధించిన విజయమని భావిస్తున్నాను. మంచి వైద్యురాలిగా ఎదిగి పేదలకు, గ్రామానికి సేవ చేయడం నా లక్ష్యం" అని తెలిపింది.కుటుంబ సభ్యుల ఆనందం, ప్రజల ఆశీర్వాదాలు,అక్షర సాధనతో యాతాకుల కుటుంబం సంతోషంలో మునిగిపోయింది. కుటుంబసభ్యులు ఆమె మరింత ఎత్తులకు చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు ఆమె విజయాన్ని ఘనంగా స్వాగతిస్తూ, భవిష్యత్తులో డాక్టరుగా వెలుగొందాలని ఆశీర్వదించారు.



## పవర్ టెక్ పరిశ్రమలో ఘనంగా విజయదశమి వేడుకలు

*** హాజరైన ప్రముఖ నటులు శివబాలాజీ , ధనరాజ్,రాకింగ్ రాకేష్లు**

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ పారిశ్రామిక వాడలోని పవర్ టెక్ పరిశ్రమలో బుధవారం పరిశ్రమ అధినేత , ఎండి, గాంధీనగర్ ఐలా చైర్మన్ పి. స్వామిగౌడ్ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో దుర్గామాత పూజలు,ఆయుధ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమానికి ప్రముఖ నటుడు శివబాలాజీ తో పాటు జబర్దస్త్ ఫేమ్ కమెడియన్లు ధనరాజ్,రాకింగ్ రాకేష్, మన స్టూడియో చైర్మెన్ మన చౌదరి లు హాజరై పరిశ్రమలో ఏర్పాటు చేసిన అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిషాసురుని పై దుర్గా మాత సాధించిన విజయానికి గుర్తు గా అమ్మవారిని కొలుస్తూ తలుస్తూ దేవీ శరన్నవరాత్రులను వివిధ అలంకరణలతో అలంకరించి , అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. దసరా అనేది చెడుపై మంచిని సాధించడమేనని అన్నారు. కార్మికులకు, శ్రేయోభిలాషులకు విజయ దశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పవర్ టెక్ పరిశ్రమ డైరెక్టర్లు పి.సాయిగౌడ్,పి. భరత్ గౌడ్,సీఈవో.సందీప్ గౌడ్,గాంధీనగర్ ఐలా ప్రతినిధుల బృందం,కుటుంబ సభ్యులు,పరిశ్రమ సిబ్బంది,కార్మికులు,బందు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## జమ్మి వేడుక ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య, వేడుకకు హజరుకానున్న రాష్ట రెవిన్యూ,గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: దసరా పండగ సందర్భంగా ప్రతి ఏటా ఇల్లందు మున్సిపాలటి పరిధిలోని సింగరేణి పాఠశాల స్థలం లో నిర్వహించే జమ్మి వేడుకకు ముఖ్య అతిధిగా *రెవిన్యూ,గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరవుతున్న సందర్భంలో ఏర్పాట్లను పరిశీలించి,ప్రఖ్యాతి గాంచిన జమ్మి వేడుకకు సుదూర ప్రాంతాల నుండి హాజరై ప్రజానికానికి ఇబ్బందులు కలుగకుండా చుడాలని మున్సిపాలటి అధికారులను ఇల్లందు నియోజకవర్గ శాసన సభ్యులు కోరం కనకయ్య ఆదేశించారు. వారి వెంట పాల్గోన్న ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు.వారితో పాటు మున్సిపాలిటి అధికారులు టౌన్,మండల పార్టీ అధ్యక్షులు దొడ్డా డానియల్,పులి సైదులు,టౌన్ ఉపాధ్యక్షుడు సుదర్శన్ కోరి,టౌన్ కార్యదర్శి ఎండీ జాఫర్,నాయకులు మాడుగుల సాంబమూర్తి,బోళ్ళ సూర్యం,చిల్లా శ్రీను,గందె సదానందం,తాటి బిక్షం,చెన్నూరి శ్రీను,చెన్నూరి క్రిష్ణ,దండుగుల శివ,సతీష్ తదితరులు ఉన్నారు.

## ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్త గూడెం: విజయదశమి పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయదశమి పండుగ అనేది ప్రజలు అత్యంత భక్తి,శ్రద్ధలతో జరుపుకునే ముఖ్యమైన పర్వదినమని, ఇది ధర్మం చెడుపై గెలిచిన శుభసూచకమని తెలిపారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు దుర్గాదేవి తొమ్మిది రూపాలను ఆరాధించడం విశేషమని, విజయదశమి పర్వదినం సమాజంలో ధర్మం, న్యాయం,సత్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.జిల్లా ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని, అదేవిధంగా జిల్లా అభివృద్ధి బాటలో ముందుకు సాగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రతి ఇంటిలో సుఖసంతోషాలు, ఐశ్వర్యం, సిరిసంపదలు నిండాలని, దుర్గామాత ఆశీస్సులు ఎల్లప్పుడూ లభించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు.

## విమానం గాల్లో ఉండగా.. ఎమ్మెల్యే, ప్రయాణికుడి మధ్య గొడవ!



ఢిల్లీ నుంచి లఖ్‌నవూ వెళ్తున్న విమానం గాల్లో ఉండగా.. ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే రాకేశ్ ప్రతాప్‌సింగ్‌కు, ఓ ప్రయాణికుడికి మధ్య వాగ్వాదం జరిగింది. ఎమ్మెల్యేను అసభ్య పదజాలంతో దూషించిన ప్రయాణికుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసలేం జరిగిందటే.. ఎయిరిండియాకు చెందిన AI837 విమానం మంగళవారం దిల్లీ నుంచి లఖ్‌నవూ బయలుదేరింది. ఇదే విమానంలో అమేథీకి చెందిన గౌరీగంజ్ ఎమ్మెల్యే రాకేశ్ ప్రతాప్‌సింగ్ కూడా ఉన్నారు. సమద్ అనే ఓ ప్రయాణికుడికి, ఎమ్మెల్యేకు మధ్య వాగ్వాదం జరిగింది. సమద్ తొలుత గట్టిగా అరవడంతో ఎమ్మెల్యే జోక్యం చేసుకొని అతనికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో అతడు రాకేశ్‌ను అసభ్య పదజాలంతో తిట్టడంతో పాటు ఆయనపై దురుసుగా ప్రవర్తించాడు. విమానం గాల్లో ఉండగానే ఈ ఘటన జరిగింది. దీంతో విమానయాన సిబ్బంది కలగజేసుకొని గొడవను పరిష్కరించారు. ఇక, విమానం లఖ్‌నవూలో ల్యాండ్ అయిన తర్వాత ప్రయాణికుడిపై ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. దీంతో ఎఫ్ఐఆర్ నమోదు చేసుకున్న పోలీసులు ఫతేపూర్ జిల్లాకు చెందిన సమద్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం దర్యాప్తు ప్రారంభించారు.

# కేసీఆర్ రైతుబంధు పాలన రైతులకు స్వర్ణయుగం అని రుజువైంది: కేటీఆర్

హైదరాబాద్: పదేళ్లలో తెలంగాణలో రైతుల బలవన్మరణాలు తగ్గాయన్న జాతీయ నేర గణాంక విభాగం నివేదికపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (KTR) ఎక్స్ వేదికగా స్పందించారు. కేసీఆర్ రైతుబంధు పాలన రైతులకు స్వర్ణయుగం అని మరోమారు రుజువైందని పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టుల వల్ల 2014 నుంచి 2023 మధ్య తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని వెల్లడించారు. "2014లో తెలంగాణలో రైతులు, కౌలుదారులు, రైతు కూలీల ఆత్మహత్యల సంఖ్య 1,347గా ఉంటే... అదే 2023లో 56గా ఉంది. 96 శాతం తగ్గుదల నమోదైంది. దేశంలోని రైతుల ఆత్మహత్యల్లో తెలంగాణ వాటా 2014లో 10.9 శాతం ఉంటే... 2023 నాటికి 0.51 శాతం తగ్గింది. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పరిస్థితి తారుమారైంది. రెండేళ్లలోనే సుమారు 700కు పైగా అన్నదాతల ఆత్మహత్యలు నమోదయ్యాయి" అని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు.



# సోషల్ మీడియాలో అసభ్య పోస్టుల కట్టడికి ఏపీ ప్రభుత్వం చర్యలు

అమరావతి: సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టుల కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనానికి ఐదుగురు సభ్యులతో క్యాబినెట్ సబ్‌కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఉప సంఘం సభ్యులుగా మంత్రులు లోకేశ్, అనిత, సత్యకుమార్, నాదెండ్ల మనోహర్, పార్థసారథి ఉన్నారు. ఏడు అంశాలపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. సోషల్ మీడియా చట్టాలు, నియమాలు, మార్గదర్శకాలు సమీక్షించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. సోషల్ మీడియా పోస్టులపై జవాబుదారీతనం, బాధ్యతలు, నియంత్రణ చర్యలు, అంతర్జాతీయ పద్ధతులు, పారదర్శక ప్రమాణాలు, వినియోగదారుల రక్షణ, హానికర కంటెంట్, తప్పుడు సమాచారం నివారణ, పోస్టులపై ఫిర్యాదులు, పరిష్కారంపై అధ్యయనం చేయాలని మంత్రివర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం ఆదేశించింది.




# తెలంగాణలో.. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై రెండో రోజు సుదీర్ఘ విచారణ

హైదరాబాద్: ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ రెండో రోజు ముగిసింది. బుధవారం ఉదయం ప్రారంభమైన విచారణ రాత్రి 7గంటల వరకు కొనసాగింది. ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, కాలే యాదయ్యను పిటిషనర్ల తరపు న్యాయవాదులు క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తి చేశారు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలకు సంబంధించి సుదీర్ఘ విచారణ కొనసాగడంతో.. మరో ఇద్దరు ఎమ్మెల్యేల విచారణ దసరా తర్వాత చేపట్టాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిర్ణయించారు. ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిలను ఈ నెల 4న పిటిషనర్ల తరపు న్యాయవాదులు క్రాస్ ఎగ్జామిన్ చేయనున్నారు.

# తెలంగాణకు కొత్తగా నాలుగు కేంద్రీయ విద్యాలయాలు

: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కొత్తగా మరో నాలుగు కేంద్రీయ విద్యాలయాలను కేటాయించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఉన్న 35 కేంద్రీయ విద్యాలయాలకు తోడుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం (యాస్పిరేషనల్ డిస్ట్రిక్ట్), ములుగు జిల్లా కేంద్రం (గిరిజన ప్రాంతం), జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండలం చెల్గల, వనపర్తి జిల్లా నాగవరం శివారులో ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ఈ నాలుగు విద్యాలయాలు మారుమూల ప్రాంతాల్లో.. నాణ్యమైన ప్రాథమిక, సెకండరీ విద్యను అందించడంలో కీలకం కానున్నాయని



కిషన్ రెడ్డి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో విద్యాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు చెప్పారు. గత రెండేళ్లలోనే కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో నాణ్యమైన సెకండరీ విద్యను అందించేందుకు రూ.400 కోట్లతో 832 పీఎంశ్రీ స్కూల్స్‌ను మంజూరు చేసిందని కిషన్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా పీఎం శ్రీ స్కూల్స్ కోసం ఎక్కువ కేటాయింపులు అందుకున్న రాష్ట్రం తెలంగాణనే కావడం విశేషమన్నారు. సమగ్రశిక్షా అభియాన్ కింద గత రెండేళ్లలో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.2వేల కోట్లు కేటాయించిందని వివరించారు. దాదాపు రూ.వెయ్యి కోట్లతో ములుగు జిల్లాలో సమ్మక్క, సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని కూడా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు.



# పెద్ద అంబర్‌పేట్ వద్ద భారీగా గంజాయి పట్టివేత

హైదరాబాద్: కొబ్బరి బోండాల మాటున తరలిస్తున్న గంజాయిని ఈగల్ బృందం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం నుంచి రాజస్థాన్‌కు డీసీఎం వ్యానులో కొబ్బరి బోండాల మాటున గంజాయి తరలిస్తున్నారు. ముందు కారులో ఎస్కార్ట్ చేస్తూ పోలీసులను గమనిస్తూ రవాణా చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్‌పేట వద్ద డీసీఎంను తనిఖీ చేసిన ఈగల్ టీమ్‌కు 401 కేజీల గంజాయి పట్టుబడింది. గంజాయితో పాటు ముగ్గురు నిందితులు, 5 సెల్‌ఫోన్లు, కారు, డీసీఎం వాహనం స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

# వరంగల్‌లో భారీ స్కాం.. అధిక వడ్డీ ఆశ చూపి రూ.11.39 కోట్లు స్వాహా

వరంగల్ (నేర విభాగం): అధిక వడ్డీ ఆశ చూపి ప్రజల నుంచి రూ.కోట్లు దోచేసిన నలుగురు సభ్యుల ముఠాను టాస్క్ ఫోర్స్, పాలకుర్తి పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా నుంచి రూ.5.92 లక్షలు, 684.5 గ్రాముల బంగారు నాణేలు, 150 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక కారు, సెల్ ఫోన్లు, ల్యాప్ టాప్, స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. "ప్రధాన నిందితుడు తెప్పాలి సైదులు తన భార్య నారాయణమ్మ పేరు మీద హెబ్సిబా పేరుతో 2023లో ఒక సంస్థను ఏర్పాటు చేశాడు. అనంతరం 2024లో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అధిక లాభాల ఆశ చూపిస్తూ చిట్టీల వ్యాపారాన్ని ప్రారంభించాడు. ఈ స్కీమ్‌లో చేరే వారు ముందుగా రూ.6 వేలు చెల్లించాల్సి ఉంటుంది. సభ్యులు చెల్లించిన డబ్బులో రూ.4 వేలు తన వద్దనే డిపాజిట్ చేసుకొని.. మిగతా రూ.2 వేలను ఈ సంస్థపై సభ్యులకు నమ్మకం కలిగించేందుకు వస్తువులను



అందజేస్తాడు. వాస్తవంగా ఈ వస్తువుల విలువ కేవలం రూ.300 మాత్రమే ఉంటుంది. ఈ సంస్థలో ఒక సభ్యుడు ఎన్నిసార్లు అయినా సభ్యత్వం తీసుకోవచ్చు. ఇందులో జాయిన్ అయిన ప్రతి సభ్యుడికి నెలకు రూ.1000 చొప్పున 20 నెలల పాటు డబ్బును తిరిగి ఇస్తానని చెప్పేవాడు. ఈ క్రమంలో సైదులు.. మిగతా నిందితులతో కలిసి గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నాడు. వీరి ద్వారా సుమారు 28,493 మంది సభ్యత్వాలు తీసుకున్నారు. రూ.4 వేల చొప్పున మొత్తం రూ.11.39 కోట్లు వసూలు చేశాడు. ఈ సంస్థపై ఫిర్యాదులు రావడంతో పోలీసులు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ ముఠా వసూలు చేసిన డబ్బును 17 బ్యాంకుల్లో జమ చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడిపై గతంలో మెదక్, సూర్యాపేట జిల్లాలతో పాటు ఇల్లందు, ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్లలో సుమారు పదికి పైగా చీటింగ్ కేసులు నమోదయ్యాయి" అని సీపీ వెల్లడించారు.



# ఆ రెండు పార్టీలకు ఓట్లు అడిగే అర్హత లేదు

: రామచందర్‌రావు

కరీంనగర్: కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి పార్టీలకు ఓట్లు అడిగే అర్హత లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడంతోపాటు 2028 లో తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆయన చెప్పారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్రం రూ.40 వేల కోట్ల విలువైన ఎరువులను రాయితీపై ఇస్తుందని, ఎరువుల కొరతను అడ్డుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం.. కేంద్రంపై నెట్టడం సరికాదన్నారు. బీసీ రిజర్వేషన్లకు తాము కట్టుబడి ఉన్నట్లు చెప్పారు.

# మావోయిస్టుల కుట్ర భగ్నం.. భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టుల కుట్రను భగ్నం చేసిన భద్రతా దళాలు భారీ విజయాన్ని సాధించాయి. పామెడ్ ప్రాంతంలోని కొరగుట్ట అడవుల్లో కోబ్రా 208 బెటాలియన్ బుధవారం కూంబింగ్ నిర్వహించింది. ఈ క్రమంలోనే మావోయిస్టులు భూగర్భంలో పెద్ద మొత్తంలో దాచిపెట్టిన పేలుడు పదార్థాలు, వారు ఉపయోగించే వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కంచల్ గ్రామంలోని అడవుల్లో ఒక గొయ్యి తవ్వి మావోయిస్టులు ఈ సామగ్రిని దాచిపెట్టారు. గన్ పౌడర్, బీజీఎల్ సెల్స్, కార్డెక్స్ వైర్, బీజీఎల్ రౌండ్లు, ఆర్‌డీఎక్స్, ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, నాన్‌ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, బాంబులు (ఇంప్రూవైజ్డ్), బారెల్స్‌లో ఉపయోగించే ఇనుప రాడ్‌లు, ఇంప్రూవైజ్డ్ గ్రెనేడ్‌లు, క్రిస్టల్ షుగర్, రైఫిల్ బయోనెట్‌లు, ఇనుప పటకార్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు.




# తాండూరులో రైలు ఎక్కుతూ జారిపడి ఏఎస్సై మృతి

తాండూరు పట్టణం: రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడి ఏఎస్సై మృతిచెందారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. వికారాబాద్ రైల్వే ఎస్‌హెచ్‌వో హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని చించోలి తాలూకా మర్పల్లికి చెందిన మారుతి (49) కలబురగి జిల్లా జేడీ హల్లి పీఎస్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి విధులకు వెళ్లేందుకు తాండూరు రైల్వేస్టేషన్‌లో రాత్రి 11 గంటల సమయంలో యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కేందుకు యత్నించారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారి రైలు కింద పడ్డారు. రెండు కాళ్లు విరిగిపోవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. రైల్వే సిబ్బంది శ్రీను, నదీమ్ ఆయన్ను వెంటనే తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

# తెలంగాణలో మరోసారి సమ్మె దిశగా ప్రైవేటు కళాశాలలు




హైదరాబాద్: ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించక పోవడంతో ప్రైవేటు కళాశాలలు సమ్మెకు సిద్ధమవుతున్నాయి. ఇవాళ అత్యవసర సమావేశం నిర్వహించిన కళాశాలల యాజమాన్యాలు భవిష్యత్ కార్యాచరణపై చర్చించాయి. సమావేశం అనంతరం ఎఫ్ఏటీహెచ్ఐ ఛైర్మన్ రమేశ్ మీడియాతో మాట్లాడారు. "ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ప్రభుత్వం విడుదల చేయలేదు. ప్రభుత్వానికి విద్యారంగం ఆఖరి ప్రాధాన్యతగా ఉంది. గత నెల 21, 22 తేదీల్లో రూ.600 కోట్లు ఇస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చినా బకాయిలు చెల్లించలేదు. కేవలం రూ.200 కోట్లు మాత్రమే విడుదల చేశారు. దీపావళిలోపు రూ.1200 కోట్లు ఇస్తామన్నారు.. ఎలా ఇస్తారో చెప్పాలి. ఈనెల 12లోపు బకాయిలు చెల్లించకుంటే.. 13 నుంచి సమ్మెకు వెళ్తాం. ఇవాళ్టి నుంచి సీఎంవో కార్యాలయంతో తప్ప మరెవరితో చర్చించం. అవసరమైతే విద్యార్థులతో కలిసి ఛలో హైదరాబాద్ చేపడతాం" అని వివరించారు.

# అభిమాని ఆరాటం.. అక్షయ్ కోసం రోల్స్ రాయిస్‌ను పోలిన కారు!

రోహ్‌తక్: హరియాణాలోని రోహ్‌తక్‌కు చెందిన ఓ కుర్రాడు తనకున్న సాంకేతిక మెలకువలతో ఖరీదైన కారును పోలిన వాహనాన్ని తయారుచేశాడు. లక్షలు ఖర్చు పెట్టి రోల్స్‌రాయిస్ తరహా కారుగా తీర్చిదిద్దాడు. ఇందుకోసం స్క్రాప్‌ను ఉపయోగించడం విశేషం. ఈ కారును తన అభిమాన బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్‌కు బహుమతిగా ఇవ్వాలని తపిస్తున్నాడు. రోహ్‌తక్‌లోని ఖేడీ మహం గ్రామానికి చెందిన పంకజ్ (18).. పదోతరగతి వరకు చదువుకున్నాడు. నటుడు అక్షయ్ కుమార్‌కు చిన్నప్పటి నుంచే వీరాభిమాని. ఆయన నటించిన 'ప్యాడ్ మ్యాన్' సినిమాను చూసి ఎంతో స్ఫూర్తి పొందాడు. ఆవిష్కరణలతో ప్రజల జీవితాల్ని మార్చవచ్చనే సారాంశం ఎంతగానో నచ్చింది. దీంతో అక్షయ్ దృష్టిలో పడేందుకు ఏదైనా చేయాలని తపించిన పంకజ్.. తనకున్న ఆలోచనలతో రోల్స్‌రాయిస్‌ను పోలిన కారును తయారు చేసి, నటుడికి బహుమతిగా ఇవ్వాలని నిశ్చయించుకున్నాడు. ఇందుకోసం నిరుపయోగ వస్తువులతో కార్లను తయారు చేయడాన్ని యూట్యూబ్‌లో చూసి నేర్చుకున్నాడు. రూ.40 వేలతో ఓ పాత కారును కొనుగోలు చేశాడు. కొన్ని విడిభాగాలను దిల్లీ మార్కెట్ నుంచి, మరికొన్ని ఇంటివద్దే తయారు చేశాడు. ఆర్థిక స్థోమత లేకున్నా అభిమాన నటుడి కోసం కుమారుడు పడుతున్న కష్టాన్ని చూసి అతడి తండ్రి సహాయం చేశాడు. మొత్తంగా నాలుగు నెలలపాటు కష్టపడి, రూ.నాలుగు లక్షలతో రోల్స్‌రాయిస్ మాదిరి కారును తీర్చిదిద్దాడు. దీన్ని ఎలాగైనా ముంబయి తరలించి.. తన అభిమాన నటుడికి అందించడమే తన లక్ష్యమని పంకజ్ చెబుతున్నాడు.



## అస్వస్థతకు గురైన మల్లికార్జున ఖర్గే.. గుండెకు పేస్‌మేకర్

బెంగళూరు: ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే మంగళవారం రాత్రి బెంగళూరులోని ఎంఎస్ రామయ్య ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. శ్వాస సంబంధ సమస్యలు, జ్వరంతో బాధపడుతున్న ఆయనకు గుండె వేగం తగ్గకుండా ఉండేందుకు పేస్‌మేకర్‌ను అమర్చాలని వైద్యులు సూచించినట్లు ఆయన కుమారుడు ప్రియాంక్ ఖర్గే వెల్లడించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. రేపు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసే అవకాశం ఉందన్నారు. మంగళవారం పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్న ఆయన.. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నష్టంపై సమీక్ష నిర్వహించారు. వరద బాధితులకు పరిహారం కోసం ప్రధానికి లేఖ రాస్తున్నట్లు ప్రకటించారు.



అనంతరం ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ఆయనను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం జనరల్ వార్డులో విశ్రాంతి తీసుకుంటున్న ఖర్గేను సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు పరామర్శించారు.

## దిల్లీ బాబా గదిలో.. అశ్లీల చిత్రాల సీడీలు.. ప్రముఖులతో ఫేక్ ఫొటోలు!

లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న దిల్లీ బాబా (స్వామి చైతన్యానంద సరస్వతి) కేసు దర్యాప్తులో విస్తుపోయే విషయాలు బయట పడుతున్నాయి. దర్యాప్తు అధికారులు ఇటీవల ఆశ్రమంలో అతడి గదిని తనిఖీ చేయగా.. ఊహించని వస్తువులు లభ్యమయ్యాయి. శృంగార బొమ్మతో పాటు అశ్లీల చిత్రాలకు సంబంధించిన సీడీలు లభ్యమైనట్లు తెలిసింది. వీటితోపాటు ప్రధాని మోదీ, అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, బ్రిటన్ నేతలతో దిగినట్లుగా ఉన్న నకిలీ ఫొటోలు లభ్యమైనట్లు సమాచారం. దిల్లీలో ఓ కళాశాల నిర్వహణ కమిటీలో సభ్యుడిగా ఉన్న స్వామి చైతన్యానంద.. ఆ కాలేజీ విద్యార్థుల నుంచి లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కేసు నమోదైన తర్వాత కొన్ని రోజులు తప్పించుకు తిరిగిన అతడిని ఇటీవల ఆగ్రాలో పోలీసులు అరెస్టు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. అతడి ఫోన్ డేటాను విశ్లేషిస్తున్నారు. మహిళా సిబ్బంది ఫొటోలు తీయడం, విద్యార్థినులతో అసభ్యంగా చాట్ చేయడం, వారి కదలికలను సీసీ కెమెరా యాప్ ద్వారా పర్యవేక్షించడం వంటి చర్యలకు పాల్పడినట్లు గుర్తించారు.

**దుబాయ్ షేక్‌కు అమ్మాయి కావాలి..!**

ఓ విద్యార్థినితో అసభ్యకరంగా చాట్ చేసిన చైతన్యానంద.. ఓ దుబాయ్ షేక్‌కు శృంగార భాగస్వామి అవసరం ఉందని, ఎవరైనా తెలుసా? అని అడిగినట్లు వెల్లడైంది. అయితే, ఎవరి కోసం అతడు అలా అడిగాడనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ఇతడి చర్యల్లో అక్కడి



మహిళా సిబ్బంది పాత్రపైనా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు దర్యాప్తునకు నిందితుడు సహకరించడం లేదని, తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించినట్లు పోలీసుల వర్గాల సమాచారం. అంతేకాదు, అతడిలో ఎటువంటి పశ్చాత్తాపం కూడా కనిపించడం లేదని దర్యాప్తు అధికారులు చెబుతున్నారు.



## విమానం గాల్లో ఉండగా.. ఎమ్మెల్యే, ప్రయాణికుడి మధ్య గొడవ!

దిల్లీ నుంచి లఖ్‌నవూ వెళ్తున్న విమానం గాల్లో ఉండగా.. ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే రాకేశ్ ప్రతాప్‌సింగ్‌కు, ఓ ప్రయాణికుడికి మధ్య వాగ్వాదం జరిగింది. ఎమ్మెల్యేను అసభ్య పదజాలంతో దూషించిన ప్రయాణికుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసలేం జరిగిందటే.. ఎయిరిండియాకు చెందిన AI 837 విమానం మంగళవారం దిల్లీ నుంచి లఖ్‌నవూ బయలుదేరింది. ఇదే విమానంలో అమేథీకి చెందిన గౌరీగంజ్ ఎమ్మెల్యే రాకేశ్ ప్రతాప్‌సింగ్ కూడా ఉన్నారు. సమద్ అనే ఓ ప్రయాణికుడికి, ఎమ్మెల్యేకు మధ్య వాగ్వాదం జరిగింది. సమద్ తొలుత గట్టిగా అరవడంతో ఎమ్మెల్యే జోక్యం చేసుకొని అతనికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో అతడు రాకేశ్‌ను అసభ్య పదజాలంతో తిట్టడంతో పాటు ఆయనపై దురుసుగా ప్రవర్తించాడు. విమానం గాల్లో ఉండగానే ఈ ఘటన జరిగింది. దీంతో విమానయాన సిబ్బంది కలగజేసుకొని గొడవను పరిష్కరించారు. ఇక, విమానం లఖ్‌నవూలో ల్యాండ్ అయిన తర్వాత ప్రయాణికుడిపై ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. దీంతో ఎఫ్ఐఆర్ నమోదు చేసుకున్న పోలీసులు ఫతేపూర్ జిల్లాకు చెందిన సమద్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం దర్యాప్తు ప్రారంభించారు. వాక్ స్వేచ్ఛ ఉంది కదా అని, ఇతరుల గౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం సరికాదని ఎమ్మెల్యే ఈసందర్భంగా విలేకరులతో అన్నారు.

## నేనే సీఎంగా ఉంటా! - సిద్దరామయ్య

కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. తమ గురువు డీకే శివకుమార్‌ను సీఎంగా చూడాలని కోరుకుంటున్నట్లు కుణిగల్ ఎమ్మెల్యే సహా పలువురు పార్టీ నేతలు డిమాండ్ చేయడం చర్చనీయాంశమైంది. వీటిపై స్పందించిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఐదేళ్ల పదవీ కాలానికి తానే సీఎంగా కొనసాగుతానని స్పష్టం చేశారు. "ఐదేళ్ల పదవీకాలానికి నేనే సీఎంగా ఉంటా. వచ్చే ఏడాది మైసూరు దసరా ఉత్సవాల్లోనూ పుష్పార్చన చేస్తాననే నమ్మకం ఉంది. అయితే, పార్టీ అధిష్ఠానం ఏది నిర్ణయిస్తే దానికి కట్టుబడి ఉండాల్సిందే" అని సిద్ధరామయ్య పేర్కొన్నారు. ముఖ్యమంత్రిని మార్చాలంటూ కాంగ్రెస్‌లో ఓ వర్గం డిమాండ్ చేస్తోందని అడిగిన ప్రశ్నకు సీఎం ఇలా స్పందించారు.



**మా గురువు సీఎం కావాలి..**

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి డీకే శివకుమార్ చేసిన కృషిని పార్టీ అధిష్ఠానం గుర్తించాలని కుణిగల్ ఎమ్మెల్యే హెచ్‌డీ రంగనాథ్ పేర్కొన్నారు. తన రాజకీయ గురువు డీకే శివకుమార్ అని.. సామాజిక సేవతో పాటు పాలనలోనూ ఆయన తనదైన ముద్ర వేసుకున్నారని చెప్పారు. రాష్ట్ర పాలనా పగ్గాలను డీకేఎస్‌కు అప్పగించాలన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, ఓటర్లు ఇదే కోరుకుంటున్నారని, ఈ దిశగా అధిష్ఠానం కూడా నిర్ణయం తీసుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

## పాక్ బలగాల కాల్పులు.. పీవోకేలో 10 మంది మృతి



పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో జరుగుతోన్న నిరసనలు హింసాత్మకంగా మారాయి. పాక్ బలగాలు జరిపిన కాల్పుల్లో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం మరో ఇద్దరు చనిపోయారు. బాఘ్, ముజఫరాబాద్, మిర్‌పుర్ ప్రాంతాల్లో ఈ మరణాలు చోటుచేసుకున్నాయని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అవామీ యాక్షన్ కమిటీ నేతృత్వంలో కొన్నిరోజులుగా పీవోకేలో నిరసనలు జరుగుతున్నాయి. పాక్ ప్రభుత్వం దశాబ్దాలుగా తమను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కుతోందని నిరసనకారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. 70 ఏళ్లకుపైగా పీవోకేలోని ప్రజలకు ప్రాథమిక హక్కులు కూడా కల్పించలేదని వాపోయారు. పీవోకేలో మౌలిక సంస్కరణలు తీసుకురావాలని.. తమ 38 డిమాండ్లను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ "షటర్‌డౌన్.. వీల్‌జామ్" పేరుతో అవామీ యాక్షన్ కమిటీ ఈ ఆందోళనలకు పిలుపునిచ్చింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తీవ్రమవుతుండడంతో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పాక్ ప్రభుత్వం పెద్ద సంఖ్యలో బలగాలను మోహరించింది. ఇంటర్నెట్‌ను నిలిపివేసింది. ఈ నిరసనలతో మార్కెట్లు, దుకాణాలు, రవాణా సేవలు నిలిచిపోయాయి. ఈ ఉదయం ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. తమను అడ్డుకునేందుకు బ్రిడ్జిలపై ఉంచిన షిప్పింగ్ కంటైనర్లను నదిలోకి నెట్టేశారు. ఈ క్రమంలోనే కాల్పులు జరిగాయి. ప్రస్తుత నిరసనలు ప్లాన్ ఏ అని, ఇంకా తమ వద్ద వేరే ప్లాన్లు ఉన్నాయని ఏఏసీ లీడర్ షౌకత్ నవాజ్ మిర్ పాక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## పాక్ సైన్యం భారీ ఆపరేషన్.. సొంత ప్రజల పైనే డ్రోన్లతో దాడి

పాకిస్థాన్ భారీస్థాయిలో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లు నిర్వహిస్తోంది. బలోచిస్థాన్ సొంత ప్రజల పైనే దాడులు చేస్తోంది. పాక్ సేనలు వాడుతోన్న శతఘ్నులు, మోర్టార్లతో కుజ్దార్ జిల్లాలోని జెహ్రీ ప్రాంత ప్రజలు వణికిపోతున్నారు. నాలుగు రోజులుగా డ్రోన్లతో జరుగుతోన్న ఈ ఆపరేషన్‌తో ప్రజలు లాక్‌డౌన్‌లోకి వెళ్లిపోయారు. వారికి ఆహారం, ఇంధనం కొరత ఏర్పడిందని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. వరుస బాంబు దాడులతో పత్తి పొలాలన్నీ ధ్వంసమయ్యాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నాయి. ఛశ్మా ప్రాంతంలో శతఘ్నులు, మోర్టార్ల కారణంగా మరణాలు సంభవించినట్లు సమాచారం. ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంతో పూర్తిస్థాయి సమాచారం అందుబాటులో లేదు. బలోచ్ లిబరేషన్ ఆర్మీ, బలోచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ లక్ష్యంగా ఈ దాడులు జరుగుతున్నాయి. వాటి అధీనంలో ఉన్న జెహ్రీని తిరిగి స్వాధీనం చేసుకొనే లక్ష్యంతో పాక్ సేనలు ఈ దాడులు చేస్తున్నాయి. ఇటీవల కూడా పాక్ సొంత ప్రజలపై దాడులు చేసిన సంగతి తెలిసిందే. గతనెల ఖైబర్ పఖ్తున్‌ఖ్వాలోని మాత్రె దారా గ్రామంపై ఫైటర్ జెట్‌లు ఎల్ఎస్ 6 రకం 8 బాంబులను జార విడిచాయి. దాంతో



పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. పాకిస్థాన్ చేపట్టిన ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లలో భాగంగా గతంలో ఈ ప్రావిన్స్‌లో దాడులు చేసింది. ఈ ఏడాది జనవరిలో అంతకుముందు నెలతో పోలిస్తే ఉగ్రదాడులు 42 శాతం పెరిగాయి. ఈ విషయాన్ని పాక్ ఇనిస్టిట్యూట్ ఫర్ కాన్ఫ్లిక్ట్ స్టడీస్ అండ్ సెక్యూరిటీ స్టడీస్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. బలోచిస్థాన్ తర్వాత అత్యధికంగా ఉగ్రదాడులు జరిగేది ఈ ప్రావిన్స్‌లోనే.

## ఖతార్‌కు నెతన్యాహు క్షమాపణ.. ట్రంప్ స్క్రిప్టా..?

హమాస్ కీలక నేతలే లక్ష్యంగా ఖతార్ రాజధాని దోహాపై దాడి చేసినందుకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇటీవల ఆ దేశానికి క్షమాపణలు చెప్పిన విషయం తెలిసిందే. సోమవారం వాషింగ్టన్‌లోని శ్వేతసౌధంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అనంతరం గాజాలో యుద్ధాన్ని ముగించాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. దీనిపై తాజాగా శ్వేత సౌధం బ్లాక్ అండ్ వైట్ చిత్రాన్ని విడుదల చేసింది. అందులో ట్రంప్, ఎదురుగా కూర్చున్న నెతన్యాహు ఖతార్ నాయకులతో ఫోన్‌లో మాట్లాడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. అయితే అప్పటికే రాసి ఇచ్చిన స్క్రిప్ట్ (script)ను చేతుల్లో పట్టుకొని.. ఆయన దానిని చదువుతున్నట్లు చిత్రంలో కనిపిస్తోంది. ఆ సమయంలో నెతన్యాహు పక్కనే కూర్చున్న ట్రంప్ ఫోన్ డయల్‌పాడ్‌ను ఒడిలో పెట్టుకొని ఉండడం గమనార్హం. దీంతో ట్రంప్‌నే పట్టుబట్టి మరీ నెతన్యాహుతో క్షమాపణలు చెప్పించినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియాలో త్వరలో యుద్ధం ముగియబోతోందని ఇటీవల ట్రంప్ ధీమాగా చెప్పారు. అనంతరం గాజాలో పరిణామాలపై సోమవారం ట్రంప్, నెతన్యాహు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. అమెరికా అధ్యక్షుడి ఒత్తిడి మేరకు ఖతార్ ప్రధాని అబ్దుల్ రహమాన్ బిన్ జస్సిమ్ అల్ థానికి ఫోన్‌లో నెతన్యాహు క్షమాపణలు చెప్పారు. గాజాలో యుద్ధాన్ని ముగించడమే కాకుండా.. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు ఏర్పాట్లు జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. శాంతి కోసం మీ ప్రణాళికకు మద్దతు తెలుపుతున్నానని.. అయితే హమాస్ నుంచి మళ్లీ ఇజ్రాయెల్‌కు ముప్పు ఉండకూడదని ఆయన ఖతార్ ప్రధానితో పేర్కొన్నారు. కాల్పుల విరమణకు సంబంధించి



యూఎస్ ప్రతిపాదన మేరకు ఇటీవల దోహాలో ఖతార్ అధికారులు, హమాస్ నేతలు భేటీ అయ్యారు. వీరి మధ్య చర్చలు జరుగుతుండగానే ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడులను ఖతార్ తీవ్రంగా పరిగణించింది. ఈ దాడులకు సంబంధించి నెతన్యాహును ట్రంప్ హెచ్చరించారు. ఖతార్ తమకు చాలా ముఖ్యమైన మిత్ర దేశమని.. దానిపై ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకున్నప్పుడు ఇజ్రాయెల్ ఆచితూచి వ్యవహరించాలన్నారు.

# తొలిసారి బిలియనీర్ల క్లబ్‌లో చేరిన షారుఖ్ ఖాన్..

## ధనవంతుల జాబితాలో ముకేశ్ అంబానీనే టాప్



**న్యూఢిల్లీ:** బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ తొలిసారి బిలియనీర్ల క్లబ్‌లో చేరారు. రూ.12,490 కోట్ల నెట్‌వర్త్‌తో తొలిసారి ధనవంతుల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఇక ఈ లిస్ట్‌లో ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా పేరుగాంచిన ముకేశ్ అంబానీనే టాప్‌లో ఉన్నారు.

హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025 14వ ఎడిషన్ ప్రకారం.. ముకేశ్ అంబానీ కుటుంబం భారత్‌లో అత్యంత సంపన్నులుగా నిలిచారు. అంబానీ ఫ్యామిలీ రూ.9.55 లక్షల కోట్లతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత గౌతమ్ అదానీ, ఆయన కుటుంబం రూ.8.15 లక్షల కోట్లతో రెండోస్థానంలో నిలిచింది. ఇక ఈ జాబితాలో రోష్ని నాదర్ మల్హోత్రా, ఆమె కుటుంబం తొలిసారి మూడోస్థానంలోకి వచ్చింది. రూ.2.84 లక్షల కోట్లతో ఆమె భారత్‌లో అత్యంత ధనవంతురాలైన మహిళగా నిలిచారు.

కాగా, భారత్‌లో బిలియనీర్ల సంఖ్య పెరుగుతోందని సదరు నివేదిక సూచిస్తోంది. ప్రస్తుతం దేశంలో మొత్తం బిలియనీర్ల సంఖ్య 350 దాటింది. 13 సంవత్సరాల క్రితం ఈ జాబితా ప్రారంభమైనప్పటి నుంచి బిలియనీర్ల సంఖ్య ఆరు రెట్లు పెరిగింది. ఇక మొత్తం బిలియనీర్ల విలువ రూ.167 లక్షల కోట్లుగా ఉంది. ఇది భారత్ జీడీపీలో దాదాపు సగం.

దేశంలో యువ బిలియనీర్ల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతున్నట్లు సదరు నివేదిక వెల్లడించింది. తాజాగా పెర్ప్లెక్సిటీ వ్యవస్థాపకుడు 31 ఏళ్ల అరవింద్ శ్రీనివాస్ రూ. 21,190 కోట్ల సంపదతో భారత్‌లోనే అతి పిన్న వయస్కుడైన బిలియనీర్‌గా నిలిచారు. భారత్‌లో బిలియనీర్ల సంఖ్యలో ముంబై అగ్రస్థానంలో నిలిచింది. ముంబై నగరంలో దాదాపు 451 మంది సంపన్న వ్యక్తులు జీవిస్తున్నారు. ఆ తర్వాత న్యూఢిల్లీలో 223, బెంగళూరులో 116 మంది అత్యంత ధనవంతులు ఉన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..

## డీఏ 3 శాతం పెంపునకు కేబినెట్ ఆమోదం

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వంలోని ఉద్యోగులకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డియర్‌నెస్ అలవెన్స్ (కరవు భత్యం) 3 శాతం పెంచింది. డీఏ పెంపు ప్రతిపాదనలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తాజా నిర్ణయంతో డియర్‌నెస్ అలవెన్స్ రేటు 55 నుంచి 58 శాతానికి పెరిగింది. ఉద్యోగులకు పెరిగిన డీఏ జులై నుంచి వర్తించనుంది. కేంద్రం నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వంలోని దాదాపు కోటిమందికిపైగా ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి చేకూరనున్నది.

కేంద్ర ప్రభుత్వం సాధారణంగా ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ పెంచుతుంది. ఇది జనవరి, జూలైల్లో జరగాల్సి ఉన్నప్పటికీ ఏటా మార్చి, అక్టోబరులో ప్రకటిస్తూ వస్తోంది. ఆలస్యంగా ప్రకటించినా.. బకాయిలతో కలిపి జనవరి, జూలై నుంచే చెల్లిస్తారు. ముఖ్యంగా డీఏ సవరణ కోసం ఆల్ ఇండియా కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్‌ను ప్రాతిపదికగా తీసుకుంటుంది. ఇదే ద్రవ్యోల్బణాన్ని అంచనా వేస్తుంది. ఈ ఏడాది మార్చిలో కూడా డీఏని 2శాతం పెంచిన విషయం తెలిసిందే. ఇప్పుడు మూడు శాతం పెంపుకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. కేంద్రం డీఏను సరవించిన నేపథ్యంలో రాష్ట్రాలు సైతం తమ ఉద్యోగులకు ఆ మేరకు డీఏ పెంచే అవకాశం ఉంటుంది.

# ఈ అక్టోబర్‌లో 21 రోజులు బ్యాంకులు మూసివేత..




**న్యూఢిల్లీ:** ఈ ఆర్థిక సంవత్సరంలో మరో నెల ముగిసిపోయింది. అక్టోబర్ మాసంలో దాదాపుగా 20 రోజులు బ్యాంకులు మూతపడనున్నాయి. ప్రతినెలా బ్యాంకులకు సెలవులు ఉండే విషయం అందరికీ తెలిసిందే. బ్యాంకుల సెలవులకు సంబంధించిన జాబితాను రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసింది. ఏవైనా ఆర్థిక సంబంధిత పనుల కోసం వెళ్లేవారు ఏయే రోజుల్లో బ్యాంకులు పని చేస్తాయో.. సెలవులుంటాయో తెలుసుకోవడం మంచిది. సాధారణ సెలవులతో పాటు పండుగ సెలవులు కలుపుకొని 20 రోజులు సెలవులు రానున్నాయి. అయితే, బ్యాంకులు మూసి ఉన్నా మొబైల్, ఇంటర్‌నెట్ బ్యాంక్, యూపీఐ సర్వీసులు యథావిధిగా పని చేయనున్నాయి. అయితే, కొన్ని అవసరాల కోసం తప్పనిసరిగా బ్యాంకుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. నగదు ఉపసంహరణ కోసం ఏటీఎంలు అందుబాటులో ఉండనున్నాయి. పలు బ్యాంకులు క్యాష్ డిపాజిట్ కోసం మెషిన్స్ సైతం అందుబాటులో ఉంచాయి. ఇందులో అకౌంట్‌లో డబ్బులు చేసుకునే వీలున్నది. కొన్ని సేవల కోసం బ్యాంకులకు వెళ్లే అవసరం ఉంటుంది. అలాంటి సమాచారం సెలవుల గురించి సమాచారం ఉంటే.. ముందస్తుగానే పనులు చేసుకునే వీలుంటుంది. మరి అక్టోబర్‌లో ఏ రోజుల్లో బ్యాంకులకు సెలవులు వచ్చాయో తెలుసుకుందాం రండి..!

అక్టోబర్ 1 : మహర్నవమి, దుర్గాపూజల సందర్భంగా అగర్తల, బెంగళూరు, భువనేశ్వర్, చెన్నై, గ్యాంగ్‌టక్, గౌహతి, ఇటానగర్, కాన్పూర్, కొచ్చి, తిరువనంతపురం, కొహిమా, కోల్‌కతా, లక్నో, పాట్నా, రాంచీ, షిల్లాంగ్‌లో బ్యాంకులకు హాలీడే.
అక్టోబర్ 2 : మహాత్మా గాంధీ జయంతి, దసరా సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో బ్యాంకులకు సెలవులు.
అక్టోబర్ 3 : దుర్గాపూజ నేపథ్యంలో గాంగ్‌టక్‌లో బ్యాంకుల మూసివేత.
అక్టోబర్ 5 : ఆదివారం సందర్భంగా దేశవ్యాప్తంగా బ్యాంకులు బంద్.
అక్టోబర్ 6 : లక్ష్మీపూజ నేపథ్యంలో అగర్తల, కోల్‌కతాలోని బ్యాంకులు బంద్.
అక్టోబర్ 7 : వాల్మీకి జయంతి, కుమార్ పూర్ణిమ సందర్భంగా బెంగళూరు, భువనేశ్వర్, చండీగఢ్, సిమ్లాలోని బ్యాంకులకు సెలవులు.
అక్టోబర్ 10 : కర్వా చౌత్ సందర్భంగా సిమ్లాలోని బ్యాంకులు మూసి ఉంటాయి.
అక్టోబర్ 11 : రెండోశనివారం సందర్భంగా బ్యాంకులకు సెలవులు.
అక్టోబర్ 12 : ఆదివారం సందర్భంగా బ్యాంకులు బంద్.
అక్టోబర్ 18 : కటి బిహు సందర్భంగా గౌహతిలో బ్యాంకులకు హాలీడే.
అక్టోబర్ 19 : ఆదివారం కావడంతో సెలవు.
అక్టోబర్ 20 : దీపావళి, నరక చతుర్దశి, కాళీపూజ సందర్భంగా అహ్మదాబాద్, బెంగళూరు, కోల్‌కతా, న్యూఢిల్లీ, లక్నో, చెన్నై సహా పలునగరాల్లో బ్యాంకుల మూసివేత.
అక్టోబర్ 21 : దీపావళి, గోవర్ధన్ పూజ సందర్భంగా ఏపీ, తెలంగాణతో పాటు బేలాపూర్, భోపాల్, భువనేశ్వర్, గ్యాంగ్‌టక్, ఇంఫాల్, జమ్ము, ముంబయి, నాగ్‌పూర్, శ్రీనగర్‌లో బ్యాంకులు బంద్.
అక్టోబర్ 22 : దీపావళి, విక్రమ్ నూతన సంవత్సరం, బలిపాడమి, లక్ష్మీ పూజ కారణంగా అహ్మదాబాద్, బెంగళూరు, డెహ్రాడూన్, గ్యాంగ్‌టక్, ముంబయి, పాట్నా సహా పలుప్రాంత్రాల్లో బ్యాంకుల మూసివేత.
అక్టోబర్ 23 : భాయ్‌దూజ్, భత్రి ద్వితీయ, చిత్రగుప్త జయంతి, లక్ష్మీపూజల నేపథ్యంలో అహ్మదాబాద్, గ్యాంగ్‌టక్, ఇంఫాల్, కాన్పూర్, కోల్‌కతా, లక్నో, సిమ్లాలో బ్యాంకుల మూసివేత.
అక్టోబర్ 25 : నాలుగో శనివారం కారణంగా బ్యాంకుల మూసివేత
అక్టోబర్ 26 : ఆదివారం సందర్భంగా దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు.
అక్టోబర్ 27 : ఛత్‌పూజ నేపథ్యంలో కోల్‌కతా, పట్నా, రాంచీల్లో బ్యాంకులు బంద్.
అక్టోబర్ 28 : చత్‌పూజ నేపథ్యంలో కోల్‌కతా, పాట్నా, రాంచీల్లో బ్యాంకుల మూసివేత
అక్టోబర్ 31 : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా అహ్మదాబాద్‌లోని బ్యాంకులకు హాలీడే.



# ఆసియా కప్ ట్రోఫీ వివాదం..

## బీసీసీఐకి క్షమాపణలు చెప్పిన పీసీబీ చైర్మన్ నఖ్వీ..!

**న్యూఢిల్లీ:** పాక్ క్రికెట్ బోర్డు చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ భారత క్రికెట్ బోర్డుకు క్షమాపణలు చెప్పాడు. ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్ తర్వాత జరిగిన పరిణామాలకు క్షమాపణలు చెప్పినట్లుగా ఇండియా టుడే కథనం ప్రచురించింది. మంగళవారం జరిగిన ఏసీసీ సమావేశంలో నఖ్వీ క్షమాపణలు చెప్పాడంటూ విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై టీమిండియా విజయం సాధించిన విషయం తెలిసిందే. ఏసీసీ చైర్మన్‌గా ఉన్న పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ నుంచి ట్రోఫీ, పతకాలు అందుకునేందుకు భారత జట్టు నిరాకరించింది. ఆ తర్వాత టీమిండియా కప్‌ను లేకుండానే సంబురాలు చేసుకుంది. ఆ తర్వాత కప్‌ను నఖ్వీ మైదానం నుంచి బయటకు తీసుకువెళ్లాలని ఏసీసీ అధికారులను ఆదేశించారు.

మంగళవారం జరిగిన ఆసియా క్రికెట్ కౌన్సిల్ సమావేశంలో ఆసియా కప్ ట్రోఫీ వివాదంలో మొహ్సిన్ నఖ్వీ వ్యవహరించిన తీరుపై బీసీసీఐ తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసింది. సమావేశానికి హాజరైన బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రోఫీ ఏసీసీ ఆస్తి, పీసీబీ చీఫ్ ఆస్తి కాదని స్పష్టం చేశారు. ట్రోఫీ, పతకాలు హోటల్ గదికి తీసుకువెళ్లే అధికారం నఖ్వీకి లేదని గుర్తు చేశారు. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా జట్టుకు ట్రోఫీని సరైన పద్ధతిలో అప్పగించాలని, తక్షణమే ఏసీసీ సంరక్షణలో ఉండాలని బీసీసీఐ డిమాండ్ చేస్తోందని శుక్లా స్పష్టం చేశారు. అయితే, బీసీసీఐకి క్షమాపణలు చెప్పినప్పటికీ భారత క్రికెట్ జట్టుకు ట్రోఫీని తిరిగి ఇవ్వడానికి నఖ్వీ నిరాకరించాడు. భారత్‌కు ట్రోఫీ కావాలంటే, సూర్యకుమార్ యాదవ్‌ను ఏసీసీ కార్యాలయంలో వ్యక్తిగతంగా పంపాలని నఖ్వీ సూచించారు. ఫైనల్ రోజున నఖ్వీ నుంచి ట్రోఫీని తీసుకునేందుకు నిరాకరించినప్పుడు.. మళ్లీ భారత జట్టు కెప్టెన్ మళ్లీ ఎందుకు దుబాయికి వస్తాడని బీసీసీఐ బీసీసీఐ బదులిచ్చింది.

# ఐసీసీ వుమెన్స్ వరల్డ్ కప్..

## భారత్-శ్రీలంక మ్యాచ్‌కు రికార్డు స్థాయిలో ప్రేక్షకులు..!



**న్యూఢిల్లీ:** ఐసీసీ వన్డే వుమెన్స్ వరల్డ్ కప్‌కు భారత్-శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్య మిస్తున్నాయి. భారత్-శ్రీలంక మధ్య మంగళవారం తొలి మ్యాచ్ జరిగింది. ఈ ప్రారంభ మ్యాచ్‌ను చూసేందుకు దాదాపు 23వేల మంది ప్రేక్షకులు స్టేడియానికి వచ్చారు. ఇది ఐసీసీ మహిళల టోర్నమెంట్ గ్రూప్ దశ మ్యాచ్‌లో రికార్డు కావడం విశేషం. మంగళవారం జరిగిన మ్యాచ్‌ను 22,843 మంది ప్రేక్షకులు ప్రత్యక్షంగా వీక్షించారు. గతేడాది దుబాయిలో జరిగిన వుమెన్స్ టీ20 ప్రపంచకప్‌లో భారత్-పాకిస్తాన్ మధ్య జరిగిన మ్యాచ్‌కు 15,935 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. తాజాగా ఐసీసీ వుమెన్స్ ప్రపంచ కప్ ప్రారంభ మ్యాచ్ 22,843 మంది హాజరయ్యారని.. ఇది ఐసీసీ వుమెన్స్ టోర్నమెంట్‌లో గ్రూప్ దశ మ్యాచ్‌లో రికార్డని ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. తొలి మ్యాచ్‌లో భారత జట్టు శ్రీలంకపై 59 పరుగుల తేడాతో గెలిచి ఈ టోర్నీ గ్రాండ్‌గా ప్రారంభించింది.

దీప్తి శర్మ ఆల్ రౌండ్ ప్రదర్శనతో భారత మహిళా జట్టు వన్డే ప్రపంచ కప్ తొలి మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో శ్రీలంకను 59 పరుగుల తేడాతో ఓడించింది. దీప్తి, అమంజోత్ కౌర్ అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. దాంతో తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు 47 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 269 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన శ్రీలంక 45.4 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయింది. దీప్తి బ్యాట్‌తో పాటు బంతితో అద్భుతంగా రాణించింది. మూడు వికెట్లు పడగొట్టింది. శ్రీలంక తరఫున 43 పరుగులతో చమరి అటపట్టు టాప్ స్కోరర్‌గా నిలిచింది. నీలాక్షి డిసిల్వా 35, హర్షిత సమరవిక్రమ 29, అచ్చిని కులసూర్య 17 పరుగులు చేశారు. దీప్తి మూడు వికెట్ల పడగొట్టగా.. స్నేహ రాణా, శ్రీ చరణి చెరో రెండు వికెట్లు తీశారు. క్రాంతి గౌడ్, అమంజోత్ కౌర్, ప్రతీకా రావల్‌కు చెరో వికెట్ దక్కింది.

# టీ20 వరల్డ్‌కప్ చెక్కులు బౌన్స్ అయ్యాయి..

## పాక్ బొక్కలు బయటపెట్టిన మాజీ స్పిన్నర్ అజ్మల్..!



**ఇస్లామాబాద్:** పాకిస్తాన్‌లో క్రికెట్ నిర్వహణ, పాలన తీరును ఆ దేశ మాజీ స్పిన్నర్ సయీద్ అజ్మల్ బయటపెట్టాడు. 2009 టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత అప్పటి ప్రధానమంత్రి ప్లేయర్స్‌కు ఇచ్చిన హామీ నెరవేరలేదని వెల్లడించాడు. సయీద్ అజ్మల్ వెల్లడి కేవలం వ్యక్తిగత అనుభవం కాదు.. యావత్ పాకిస్తాన్ క్రికెట్ వ్యవస్థ బలహీనతను ప్రతిబింబిస్తున్నది. ప్రపంచ చాంపియన్ జట్టుకు ఇస్తామని ప్రకటించిన ప్రోత్సాహకాలను నేటికీ చెల్లించలేదు. మిగతా దేశాలు మాత్రం కోట్లాది రూపాయల ప్రోత్సాహకాలు ఇస్తూ ఆటగాళ్లను ప్రోత్సహిస్తున్నాయి. యూనిస్ ఖాన్ నాయకత్వంలో పాకిస్తాన్ 2009లో ఇంగ్లండ్‌లోని లార్డ్స్‌లో శ్రీలంకను ఓడించి టైటిల్ గెలుచుకుంది. ఇది పాకిస్తాన్ క్రికెట్‌కు ఒక చారిత్రాత్మక క్షణం.

అయితే, ప్రపంచకప్ గెలిచిన సందర్భంలో ఆటగాళ్లకు లభించి గుర్తింపు.. ప్రకటించిన ప్రోత్సాహకాలన్నీ బూటకమేనని మాజీ స్పిన్నర్ వెల్లడించారు. ప్రపంచ కప్ గెలిచిన తర్వాత పాకిస్తాన్‌కు తిరిగి వచ్చిన సందర్భంగా తమకు పెద్దతగా బహుమతులు ఏమీ ఇవ్వలేదని.. ఆ సమయంలో శ్రీలంక పర్యటనకు వెళ్లామని.. ఈ సమయంలో ప్రధానమంత్రి పిలిచి ప్రతి ఆటగాడికి రూ.25లక్షల చెక్కును ఇచ్చారన్నారు. ఆ రోజుల్లో అది చాలా పెద్ద మొత్తం కావడంతో సంతోషించామని.. కానీ ఆ చెక్కును మార్చుకునేందుకు బ్యాంకుకు వెళ్తే అది బౌన్స్ అయ్యిందని వెల్లడించాడు. ఇది ఆటగాళ్లకు షాక్‌లాంటిదని తెలిపాడు. ప్రభుత్వం ఇచ్చిన చెక్కు బౌన్స్ అవుతుందని తాను నమ్మలేకపోయానని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్లేయర్స్ పీసీబీ సహాయం కోరినా ఎలాంటి సహాయం అందలేదని అజ్మల్ ఆరోపించాడు.

తాము ప్రపంచకప్ గెలిచినందుకు ఐసీసీ వచ్చిన ప్రైజ్‌మనీ మాత్రమే అందిందని చెప్పాడు. అజ్మల్ వ్యాఖ్యలు పాక్ క్రికెట్ పరిపాలన పనితీరు, ప్రభుత్వ నిబద్ధతపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఈ ఏడాది యూఏఈ వేదికగా జరిగిన ఆసియా కప్‌లో గెలిచిన భారత జట్టుకు బీసీసీఐ ఇటీవల రూ.21కోట్ల ప్రోత్సాహక బహుమతి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే అజ్మల్ ఈ విషయాన్ని బయటపెట్టాడు. ఆటగాళ్లతో పాటు సహాయక సిబ్బందికి ప్రోత్సాహకం బీసీసీఐ ఇవ్వనున్నది.

# రాజకీయాలా? పీసీబీ పదవా? ఏదో ఒకటి తేల్చుకో..

## నఖ్వీకి ఆఫ్రిది వార్నింగ్..!





**న్యూఢిల్లీ:** ఆసియా కప్ ఫైనల్‌లో భారత్ చేతిలో పాకిస్తాన్ దారుణంగా ఓటమిపాలైంది. ఈ టోర్నీలో వరుసగా మూడు మ్యాచుల్లో ఓటమిపాలైంది. దాంతో పాకిస్తాన్ క్రికెటర్లతో పాటు పీసీబీ చైర్మన్‌కు ఇబ్బందికరంగా మారింది. పీసీబీ చైర్మన్, హోంమంత్రి మొహ్సిన్ నఖ్వీ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా పీసీబీ చైర్మన్ నఖ్వీపై పాకిస్తాన్ మాజీ కెప్టెన్ షాహిద్ విరుచుకుపడ్డాడు. క్రికెట్ బోర్డు.. రాజకీయాలు ఇందులో ఏదో ఒకదాన్ని ఎంచుకోవాలని సూచించాడు. 'మిస్టర్ నఖ్వీకి రిక్వెస్ట్ ఏంటంటే.. ఈ రెండు పదవులు కీలకమైనవి. సమాన సమయంతో పాటు శ్రద్ధ కూడా అవసరం. పీసీబీ వ్యవహారాలు హోంమంత్రిత్వశాఖకు పూర్తిగా భిన్నంగా ఉంటాయి. స్వతంత్రంగా నిర్వహించాలి. కానీ పాకిస్తాన్ క్రికెట్ భవిష్యత్తుకు అవసరమైన దశ'గా పేర్కొన్నాడు. నఖ్వీ తనకు క్రికెట్ గురించి పెద్దగా తెలియదని పలుసార్లు అంగీకరించాడు. అయితే క్రికెట్‌కు సూక్ష్మ నైపుణ్యాలను అర్థం చేసుకునే సమర్థులైన సలహాదారులు అవసరమని.. నఖ్వీకి సలహాదారులపై మాత్రమే ఆధారపడి పీసీబీని నడపలేదని ఆఫ్రిది పేర్కొన్నాడు. పాకిస్తాన్ క్రికెట్‌కు పూర్తి సమయం, శ్రద్ధ వహించే వ్యక్తి అవసరమని.. లేకపోతే దాని భవిష్యత్తు మరింత చీకటిగా మారుతుందని అఫ్రిది వ్యాఖ్యానించాడు.

ఇదిలా ఉండగా.. ఆసియా కప్ ఫైనల్ విజయం అనంతరం నఖ్వీ చేతుల మీదుగా ఆసియా కప్ ట్రోఫీని అందుకునేందుకు భారత జట్టు నిరాకరించింది. యూఏఈ, శ్రీలంక క్రికెట్ చీఫ్ నుంచి మాత్రమే ట్రోఫీని స్వీకరిస్తామని స్పష్టం చేసింది. అయితే, ఏసీసీ చైర్మన్ హోదాలో ఉన్న నఖ్వీ అందుకు నిరాకరించాడు. టీమిండియా ట్రోఫీని తీసుకునేందుకు నిరాకరించడంతో ట్రోఫీని ఆసియా క్రికెట్ కౌన్సిల్ కార్యాలయానికి పంపాడు. అయినప్పటికీ, భారత జట్టు ట్రోఫీ లేకుండా సంబరాలు చేసుకుంది. ఈ చర్య పాకిస్తాన్ ప్రతిష్టను మరింత దిగజార్చింది. నఖ్వీ వ్యవహరించిన తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. వీలైనంత తర్వగా పీసీబీ చైర్మన్ పదవా? రాజకీయాలా ? అనే విషయంపై నఖ్వీ త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఆఫ్రిది సూచించాడు. రాజకీయాల్లో కొనసాగాలనుకుంటే పీసీబీ చైర్మన్ పదవిని వదులుకోవాలని.. పీసీబీలో కొనసాగాలనుకుంటే రాజకీయాలు, అధికార పదవులకు దూరంగా ఉండాలని సూచించాడు. క్రికెట్ పరిపాలన విషయంలో ఎలాంటి రాజీపడకూడదని.. నఖ్వీ ద్వంద్వ పాత్రల్లో కొనసాగడం వల్ల పాకిస్తాన్ క్రికెట్ మరింత పతనమవుతుందని హెచ్చరించాడు.

## ప్రియుడితో మూడు ముళ్లు వేయించుకున్న అవికా గోర్

**సామాజిక కార్యకర్త మిలింద్ చంద్వానిని వివాహం చేసుకున్న అవికా గోర్**

**సోషల్ మీడియా ద్వారా వెల్లడించిన అవికా గోర్**

**వివాహ వేడుక ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్**

**శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు, సినీ ప్రముఖులు**



**టాకీస్:** 'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్ ద్వారా దేశవ్యాప్తంగా పేరుగాంచిన నటి అవికా గోర్ కొత్త జీవితంలోకి అడుగుపెట్టారు. ఆమె కొంతకాలంగా ప్రేమలో ఉన్న సామాజిక కార్యకర్త మిలింద్ చంద్వానిని వివాహం చేసుకున్నారు. ఇదివరకే జూన్‌లో నిశ్చితార్థం చేసుకున్న ఈ జంట, తాజాగా మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. వివాహ వేడుకకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వీటిని చూసిన అభిమానులు, సినీ ప్రముఖులు అవికా- మిలింద్ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

### ఐదేళ్ల ప్రేమ, ఒక్కటైన హృదయాలు

అవికా – మిలింద్ ప్రేమ కథ 2019లో ప్రారంభమైంది. ఓ సామాజిక కార్యక్రమంలో కలుసుకున్న వీరిద్దరూ మొదట స్నేహితులుగా ఉ ండి, ఆపై 2020 నుంచి ప్రేమాయణం కొనసాగించారు. దాదాపు ఐదేళ్ల పాటు ప్రేమాయణం కొనసాగించిన ఈ జంట, కుటుంబ సభ్యుల ఆశీర్వాదాలతో వివాహ బంధంతో ఒక్కటయ్యారు.

### సీరియల్ నటిగా కేరీర్ మొదలు

సీరియల్ నటిగా కెరీర్ మొదలుపెట్టిన అవికా.. బాలీవుడ్‌తో పాటు తెలుగులోనూ పలు చిత్రాల్లో హీరోయిన్‌గా నటించారు. ఆమె తొలి తెలుగు చిత్రం 'ఉయ్యాలా జంపాలా' (2013)తో మంచి గుర్తింపు సంపాదించారు. ఆ తర్వాత 'సినిమా చూపిస్త మామ', 'లక్ష్మీ రావే మా ఇంటికి', 'ఎక్కడికి పోతావ్ చిన్నవాడా', 'రాజుగారి గది 3', 'థ్యాంక్యూ' వంటి సినిమాల్లో నటించారు. ప్రస్తుతం 'షణ్ముఖ్' అనే తెలుగు చిత్రంలో అవికా నటిస్తున్నారు.

### సింపుల్ వెడ్డింగ్, సోషల్ మీడియాలో శు భాకాంక్షల వర్షం

అతి దగ్గరి బంధువుల సమక్షంలో వివాహం ఎంతో నిరాడంబరంగా జరిగింది. ఫోటోలు, వీడియోల ద్వారా వీరి ఆనందాన్ని అభిమానులతో పంచుకుంటున్నారు. అవికా తన ఇన్‌స్టాగ్రామ్‌లో, "ఇది నిజమైన ప్రేమ. మిమ్మల్ని అందరినీ కలిపి చూసుకోవాలని ఉంది. నన్ను పూర్తిగా అర్థం చేసుకున్న వ్యక్తితో జీవితం మొదలుపెడుతున్నం దుకు సంతోషంగా ఉంది" అని పేర్కొన్నారు.



# సవాళ్ల స్వీకరణలో భయపడేది లేదు

**నటి దీపికా పడుకొణె సమాధానం**

టాకీస్: గత కొన్ని రోజులుగా దీపికా పదుకొణెకు సంబంధించిన కొన్ని విషయాలు వైరల్‌గా మారగా... తాజాగా ఆమె వీటిపై స్పందించారు. ఇటీవల జరిగిన ఫరాఖాన్ అంశంపై ఓ మీడియా కథనానికి స్పష్టతనిచ్చారు. అలాగే తన స్వభావం గురించి మరో ఇంటర్వ్యూలో మాట్లాడారు. తాను ఎప్పుడూ, దేనికీ భయపడలేదని చెప్పారు. ప్రముఖ కొరియోగ్రాఫర్, దర్శకురాలు ఫరాఖాన్, దీపికా ఒకరినొకరు ఇన్‌స్టాలో అన్‌ఫాలో చేసుకొన్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ఫరాఖాన్ ఘాటుగా స్పందించారు. దీనికి సంబంధించిన కథనాన్ని రాసిన మీడియాకు ఆమె రిప్లై పెట్టారు. సోషల్ మీడియాలో కాకుండా డైరెక్ట్‌గా మాట్లాడుకోవాలని తాను, దీపిక నిర్ణయించుకున్నట్లు చెప్పారు. అందుకే పుట్టినరోజు శుభాకాంక్షల పోస్ట్‌లు కూడా పంచుకోమన్నారు. అలాంటివి దీపికకు నచ్చవని చెప్పారు. చిన్న విషయాలను ఇలా వివాదాస్ప దంగా మార్చొద్దని కోరారు. దీనికి దీపిక కూడా రిప్లై పెట్టారు. ఫరాఖాన్ కామెంట్సే తాను కూడా చెప్పాలనుకున్నానన్నారు. తథాస్తు.. అంటూ చేతులు జోడించిన ఎమోజీలను పంచుకున్నారు. దీంతో ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పడింది. సినిమాలకు రేటింగ్స్ ఇచ్చే ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ పోర్టల్ ఐఎండీబీ తాజాగా 26 ఏళ్ల సినిమాలకు సంబంధించిన నివేదికను విడుదల చేసింది. ఒక్కో ఏడాదిలో విశేష ఆదరణ పొందిన చిత్రాల జాబితాను పంచుకుంది. ఇందులో దీపిక నటించిన 10 చిత్రాలు ఉండడం విశేషం. దీనిపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. నా కెరీర్‌లో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాను. సవాళ్లను స్వీకరించడంలో భయపడలేదు. వాటికీ ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నాను. ప్రశ్నించడానికి కూడా వెనుకాడను. నా కుటుంబం, అభిమానుల సహకారం, ప్రేమాభిమానాలే నాకు విమర్శలను ఎదుర్కోగల శక్తినిచ్చాయి. ఈ నివేదిక నాలో ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచిందని తెలిపారు.

# మెగాస్టార్ సరసన 'శశిరేఖ'..

**ఆకట్టుకుంటున్న నయనతార లుక్**

**చిరంజీవి 'మన శంకరవరప్రసాద్ గారు' నుంచి కొత్త అప్‌డేట్**

**నయనతార పాత్ర పేరు 'శశిరేఖ'గా వెల్లడి, ఫస్ట్ లుక్ విడుదల**

**దసరా పండగకు మరో సర్‌ప్రైజ్ ఇస్తామన్న దర్శకుడు అనిల్ రావిపూడి**

**సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న విక్టరీ వెంకటేశ్**

టాకీస్: మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రం నుంచి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న నయనతార పాత్ర పేరుతో పాటు ఆమె ఫస్ట్ లుక్‌ను అభిమానులతో పంచుకున్నారు. ఈ చిత్రంలో నయనతార 'శశిరేఖ' అనే పాత్రలో కనిపించనున్నట్లు దర్శకుడు అనిల్ రావిపూడి సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా అధికారికంగా ప్రకటించారు. పాత్రకు సంబంధించిన లుక్‌ను కూడా విడుదల చేయగా, అది ఆకట్టుకుంటోంది. ఇదిలా ఉండగా, దసరా పండగ సందర్భంగా రేపు మరో సర్‌ప్రైజ్ కూడా రాబోతోందని అనిల్ రావిపూడి తన పోస్టులో పేర్కొన్నారు. దీంతో అభిమానుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. పండగ రోజు రాబోయే ఆ కొత్త కబురు ఏమై ఉ ంటుందా..? అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో విక్టరీ వెంకటేశ్ కూడా ఓ ముఖ్యమైన పాత్రలో నటిస్తుండటం విశేషం. చిరంజీవి, వెంకటేశ్ వంటి అగ్ర తారలు కలిసి నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉ న్నాయి. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేస్తామని గతంలోనే మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే.






### తేరే ఇష్క్ మే టీజర్ విడుదల

**టాకీస్:** బాలీవుడ్‌లో 'రాన్‌జానా' వంటి బ్లాక్‌బస్టర్ హిట్‌ను అందించిన దర్శకుడు ఆనంద్ ఎల్ రాయ్‌తో హీరో ధనుష్ మరో సారి చేతులు కలిపారు. ఈ జంట కొత్త సినిమా 'తేరే ఇష్క్ మే' పేరుతో నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. హిందీ తో పాటు తమిళ భాషలో కూడా ఒకేసారి రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో ధనుష్ ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్‌గా కొత్త లుక్‌లో కనిపించబోతు న్నారు. కృతి సనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా విడుదలైన టీజర్‌లో ధనుష్ పాత్రలోని భావోద్వేగాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కనీసం నీ పాత పాపాలు కడుక్కో' అని కృతితో చెప్పే డైలాగ్ టీజర్‌కు హైలైట్‌గా నిలిచింది. హిమాన్షు శర్మ, నీరజ్ యాదవ్ కథ రాసిన ఈ సినిమాను ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహిస్తున్నారు.

# ప్రకాశ్,సింగర్ సైంధవిల వైవాహిక బంధానికి తెర

**పరస్పర అవగాహనతో విడాకులు**

**టాకీస్:** ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్, సింగర్ సైంధవి వైవాహిక బంధంగా ముగిసింది. ఇద్దరు గత కొద్దిరోజుల కిందట విడిపోతున్నామని సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఇద్దరు పరస్పర అంగీకారంతో విడాకుల కోసం దరఖాస్తు చేసుకోగా.. విచారణ జరిపిన చెన్నైలోని ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేస్తూ తీర్పును వెలువరించింది. ఇద్దరు గత కొద్దిరోజుల కిందట విడిపోతు న్నామని సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఇద్దరు పరస్పర అంగీకారంతో విడాకుల కోసం దరఖాస్తు చేసుకోగా.. విచారణ జరిపిన చెన్నైలోని ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేస్తూ తీర్పును వెలువరించింది. దాంతో దాదాపు 12 సంవత్సరాల వైవాహిక బంధం ముగిసిపోయింది. ఇద్దరు గతకొంతకాలంగా వేర్వేరుగా ఉంటూ వస్తున్నారు. ఈ ఏడాది మార్చి 24న చెన్నైలోని మొదటి అదనపు ఫ్యామిలీ కోర్టులో విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయమూర్తి సెల్వ సుందరి ఆరు నెలల గడువు గడువు ఇచ్చారు. అయితే, సెప్టెంబర్ 25న మరోసారి పిటిషన్ విచారణకు వచ్చింది. జీవీ ప్రకాశ్, సైంధవి ఇద్దరూ స్వయంగా కోర్టుకు హాజరై విడిపోవాలన్న నిర్ణయానికే కట్టుబడి ఉ న్నామని కోర్టుకు తెలిపారు. ఈ



దంపతులకు కుమార్తె ఉంది. ఎవరి వద్ద ఉ ంటుందని న్యాయమూర్తి ప్రశ్నించారు. తన సంరక్షణలోనే ఉంటుందని సైంధవి చెప్పగా.. జీవీ ఇందుకు అభ్యంతరం చెప్పలేదు. ఈ క్రమంలో కోర్టు విడాకులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

జీవీ ప్రకాశ్ ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ మేనల్లుడు. కోలీవుడ్‌లో స్టార్ మ్యూజిక్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నాడు. అలాగే, హీరోగానూ పలు చిత్రాల్లో నటించాడు. తెలుగులోనూ పలు చిత్రాలకు సంగీతం అందించాడు. సైంధవి 12వ సంవత్సరాల వయసులో ఓ టీవీ షో సింగర్‌గా గుర్తింపు పొంది. విక్రమ్ అన్నియన్ (తెలుగులో అపరిచితుడు) చిత్రంతో సినీరంగంలోకి సింగర్‌గా ఎంట్రీ ఇచ్చింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.